ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 26.0
కనిష్ఠం : 24.0

కుక్కునూరులో 200 మి.మీ వర్షపాతం ..

ఏలూరు సిటీ : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కుండపోతగా వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటలలో జిల్లాలోనే అత్యధికంగా కుక్కునూరు మండలంలో 200.8 మిల్లీమీటర్లు (20 సెంటీమీటర్లు) మేరకు భారీగా వర్ష పాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 79.3 మి.మీ నమోదైంది. వేలేరుపాడు 158, ముసునూరు 156, నూజివీడు 142.2, ఆగిరిపల్లి 128.8, లింగపాలెం 115.6, జంగారెడ్డిగూడెం 99.2, కైకలూరు 92.4, పెదవేగి 90.2, కామవరపుకోట 83, జీలుగుమిల్లి 78, కలిదిండి 73.4, మండవల్లి 69.6, చాట్రాయి 68.4, ముదినేపల్లి 67.8, ద్వారకాతిరుమల 65.8, దెందులూరు 62.4, పెదపాడు 51.4, ఏలూరు అర్బన్ 50.2, ఏలూరు రూరల్ 49.8, కొయ్యలగూడెం 47.8, టి.నరసాపురం 45.8, భీమడోలు 45.8, చింతలపూడి 45, నిడమర్రు 38.4, పోలవరం 30.2, ఉంగుటూరు 25.4 మి.మీ వర్షపాతం నమోదయింది.

ఏలూరు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రతరం కావడంతో రాగల 24 గంటల్లో భారీ ఏలూరు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చ రికల్లో భాగంగా ఏలూరు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వాయుగుండం తీరం దాటే సమయంలో ఈదు రు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

9,872 ఎకరాల్లో పంటనష్టం

వాయుగుండం కారణంగా కురిసిన అతిభారీ వర్షాలకు జిల్లాలో 9,872 ఎకరాల్లో వివిధ పంటలు ముంపునకు గురయ్యాయి. 18 మండలాల్లోని 133 గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, మినుము, పెసలు, వేరుశనగ, చెరకు, మిరప పంటలు ముంపునకు గురయ్యాయి. జిల్లాలో ముంపునకు గురైన పంటల వివరాలు ఇలా ఉన్నాయి. వరి 7987 ఎకరాలు, పత్తి- 368, మినుము- 1,428, పెస లు- 7, వేరుశనగ - 19, చెరకు -16, మొక్కజొన్న-2, మిరప 45 ఎకరాల్లో ముంపునకు గురైంది.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ రద్దు

జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఈనెల 2వ తేదీ సోమవారం జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అధికారులంతా పునరావాస కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నందున కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల స్థాయిల్లో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు వివరించారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఏలూరు అర్బన్ : ఎడతెరిపిలేని వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమ వారం సెలవుదినంగా ప్రకటిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా మరో పనిదినంలో పాఠశాలలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. కాగా సోమవారం జరగాల్సిన సెల్ఫ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ ఎంపీ-1) పరీక్షను తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు.

కన్నీటిధార..


నీట మునిగిన ఇళ్ల నుంచి సామగ్రిని బయటకు తీసుకొస్తున్న తాళ్లమూడి ఎస్సీ కాలనీ వాసులు


పెదపాడు మండలం తాళ్లమూడి వద్ద హైవేపై వరద నీరు

భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం

- పోటెత్తిన రామిలేరు.. అప్పన్నవీడు అతలాకుతలం
- జగనన్నకాలనీతో పాటు పలు కాలనీలు మునక
- వేలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- నూజివీడు వరద ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పార్థసారథి.. కలెక్టర్, ఎస్పీ
- కొల్లేరుకు వరద ముంపు
- ముంపు మండలాల్లోనూ వాన బీభత్సం
- తమ్మిలేరు మరింత ఉగ్రరూపం.. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ఏలూరులో అధికారులు అప్రమత్తం
- జిల్లాలో పరిస్థితిని ఆరా తీసిన సీఎం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

భారీ వర్షాలు, పొంగిన వాగులు జన జీవనాన్ని అస్త వ్యస్తం చేశాయి. చాన్నాళ్ల తర్వాత మెట్ట ప్రాంతాల్లోను చెరువులకు గండి పడడంతో అనేక మంది నిరాశ్రయుల య్యారు. జిల్లా యంత్రాంగం తక్షణం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టడంతో ప్రాణ నష్టం తప్పింది. అధికారులు చురుగ్గా కదలడంతో సహాయక చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. నూజివీడు, పెద పాడు మండలాల్లో సహాయ శిబిరాల్లో 1200 మందికి పైగా చేరారు. మరో వెయ్యి మందికిపైగా సమీప ప్రాంతాలకు చేరుకున్నారు. మరోవైపు గోదావరి ఉరకలు వేస్తోంది. పోల వరం వద్ద వరద ఉధృతి పెరిగింది. తమ్మిలేరులో వరద ఉధృతి పెరగడంతో మూడు గేట్లను ఎత్తివేశారు. తెలంగాణలో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో కుక్కునూరుపై దాని ప్రభావం పడింది. సహాయక చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం ఆరా తీశారు.

చెరువులు తెగాయి.. వాగులు పొంగాయి

ఏలూరు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలతో వందలాది మంది నిరాశ్రయులయ్యారు. నూజివీడు పట్టణంలో పెద్ద చెరువుకు గండి పడిన దరిమిలా భారీ నష్టం వాటిల్లింది. పట్టణంలోని వెలమపేటతో సహా మరో రెండు ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చొచ్చుకొచ్చింది. ఈ కారణం గా నివాస గృహాలన్నీ పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆయా గృహాల్లో ఉన్న వారందరినీ ఇప్పటికే సహాయక శిబి రాలకు చేర్చారు. దాదాపు 32 మందికి పైగా రెండు శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. మిగిలిన వారిని సహాయక శిబిరాలకు చేర్చేందుకు అధికారులు ఆదివారం కూడా ప్రయత్నించారు. మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడులోనే మకాం వేసి సహాయక చర్యలను పర్య వేక్షించారు. వరద ప్రాం తాలను సందర్శించి స్థానికు లకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా తీసు కుంటున్న చర్యలను వారం దరికీ వివరించారు. మరోవైపు ఏలూరు జిల్లాలో ప్రస్తుత వరద పరిస్థితిని మంత్రి పార్థసారథితో ఫోన్‌లో ఆదివారం సీఎం చంద్రబాబు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టాలు జరగ కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సహా యక శిబిరాలను, వరద ప్రాంతాన్ని రెండో రోజు కూడా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప శివకిశోర్, జేసీ ధాత్రి రెడ్డి, ఆర్డీవో భవాని శంకరి తదితరు లంతా సందర్శించారు. ఇంకా భారీ వర్షాలు పొంచి ఉన్నందున తక్ష ణం శిథిలావస్థలో ఉన్న ఇళ్ల నుంచి బాధితులను సహాయక శిబిరాలకు చేర్చాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. నూజివీడులో చెరువుకు గండిపడిన వెంటనే సహాయ చర్యల్లో పాల్గొని ప్రాణ నష్టం జరగకుండా నివారించిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని ఎస్పీతో సహా మిగతా అధికారులు అభినందనలతో ముంచెత్తారు. పెదపాడు మండలంలో రామిలేరు విలయం సృష్టించింది. అప్పన్నవీడు వద్ద రామిలేరు పొంగి ప్రవహిం చడంతో శనివారం అర్ధరాత్రి సమయాన జగనన్నకాలనీ, మరో రెండు ఎస్సీ కాలనీలను వరద ముంచెత్తింది. దీంతో తెల్లవారుజాములోపే దాదాపు వెయ్యి మందికిపైగా స్థానికు లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎమ్మెల్యే చింతమ నేని ప్రభాకర్ తెల్లవారుజాము నుంచే దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ వెట్రిసెల్వి సైతం రామిలేరు బీభత్సాన్ని పరిశీలించారు. కలపర్రు టోల్‌గేట్ సమీపంలోని బొమ్మలూరు వద్ద జాతీయ రహదారిపై నీరు చేర డంతో ఆరుగంటల పాటు రాకపోకలు నిలిచాయి.


నూజివీడులో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి


నూజివీడులో వరద బాధితుల్లను పరామర్శిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఆర్డీవో


పెదపాడు మండలం తాళ్లమూడి జగనన్న కాలనీ ముంపు పరిస్థితులను కలెక్టర్, ఎస్పీలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

తమ్మిలేరు మరింత ఉధృతం

తమ్మిలేరుకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేర డంతో చింతలపూడి సమీపంలోని ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తివేసి దిగువకు వరద నీరు విడుదల చేయడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాగా ఏలూరు వైపు వరద నీరంతా దూసుకొస్తోంది. ఆదివారం రాత్రికి ఏలూరులోని శనివారపుపేట కాజ్‌వేపై వరద ఉధృతిగా ప్రవహి స్తోంది. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డిలతో కలిసి శనివారపుపేట కాజ్‌వే, తమ్మిలేరువాగు, తంగెళ్ళ మూడి ప్రాంతాల్లోని తమ్మిలేరు బ్రిడ్జిలను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలవరం వద్ద గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. గుండే రువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సత్యనారాయణ పురం వద్ద రాకపోకలు నిలిచిపోయాయి.

ముంపు మండలాలకు ముంపు

ముంపు మండలాలైన కుక్కునూరు మండల శివారు గ్రామమైన సీతారామపురంలో వరద నీరు ముంచెత్తడంతో దాదాపు 80 ఎకరాలకు పైగా నీట మునిగాయి. వేలేరు పాడులో పెదవాగు పొంగడంతో వేలేరుపాడు-రుద్రంకోట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పెదవాగు రిజర్వా యరుకు ఇంతకుముందే గండి పడింది. ఆ గండిని తాత్కా లికంగా మూసివేసేందుకు రింగ్‌బండ్‌ను ఏర్పాటు చేశారు. తాజా వర్షాల కారణంగా రింగ్‌బండ్ కూడా దెబ్బతిన్నట్టు సమాచారం.


చాట్రాయి-బూరుగ్గూడెం మధ్య ఉధృతంగా పెద్ద చెరువు వాగు


పెదపాడు మండలం పునుకొల్లు వద్ద కృష్ణా కాల్వకు గండి పడిన దృశ్యం

కొల్లేరు లంకలకు రాకపోకలు బంద్

భారీ వర్షాల కారణంగా కొల్లేరులో క్రమేపీ వరద నీటి మట్టం పెరుగుతోంది. లంక గ్రామాలకు వెళ్లే మార్గాలన్నిం టిపై వరద నీరు చేరుతోంది. ఆదివారం నాటికే పలు లంకల కు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా స్థానికులంతా అప్రమత్తంగా ఉండాల్సిందిగా పెద్దలు అన్ని గ్రామాలను అప్రమత్తం చేశారు. తాజా పరిస్థితిపై అధికారులు ఆరా తీసి సహాయక చర్యలకు దిగుతున్నారు. రానున్న రెండు రోజుల్లో మరింతగా వర్షాలు పడితే లంక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకునే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.


పెదపాడు మండలం అప్పనవీడు వద్ద హైవేపై వరదనీరు


కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాలను నిలిపివేసిన దృశ్యం


పెద్దచెరువు వరద కోతకు గురైన నూజివీడు బైపాస్‌రోడ్డు


ఆటపాక పక్షుల కేంద్రం వద్ద కొల్లేరు ఉధృతికి కొట్టుకుపోయిన కోమటిలంక రహదారి


పెదపాడు మండలం అప్పనవీడులో ఇళ్లలోకి చేరిన వరద

వరద నష్టనివారణ చర్యలు : ఎంపీ

ఏలూరు టూటౌన్ : జిల్లాలో వరద పరిస్థితులపై అధి కారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్, ఎస్పీ, సంబం ధిత అధికారుల నుంచి వరద పరిస్థితులను ఆరా తీస్తున్నారు. అత్యవసర సమయాల్లో బాధితులు ఎంపీ క్యాంపు కార్యాలయం ఫోన్ నంబర్ 98855 19299కు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు.

జలాశయాలకు జలకళ


పోగొండ జలాశయం

పోలవరం/ బుట్టాయగూడెం/ జంగారెడ్డి గూడెం/ చింతలపూడి : భారీవర్షాలకు జిల్లాలోని జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. కొండవాగుల జలాలతో ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్ నీటితో నిండింది. రిజర్వాయర్ వద్ద 89.70 మీటర్ల నీటిమట్టం నమోదయ్యిందని, అదనపు జలాలను స్పిల్‌వే రెండు గేట్లు ఎత్తి 360 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు. ఈ జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి లోకి ప్రవహిస్తున్నాయి. కడమ్మ కాల్వ జలాలు, ఇసుక కాల్వ జలాలు కడెమ్మ వంతెన నుంచి కడెమ్మ స్లూయిజ్ గేట్ల ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. బుట్టాయగూడెం మండలం లోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం లోకి కొండవాగుల ద్వారా 300 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా జలాశయం గేట్లను ఎత్తి అధికారులు 150 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి నీటిమట్టం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 215.70 ఎంటీఎస్‌గా ఉన్న ట్టు ఇరిగేషన్ ఏఈలు సురేష్, తులసీ తెలిపారు. పోగొండ జలాశయం కూడా వరదనీటితో నిండింది. భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారి గూడెంలోని శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయానికి గంటకు 3800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరు తుండగా 2200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశా రు. జలాశయం నీటిమట్టం 83.50 కాగా ప్రస్తుతం 81.95 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు.చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 348.44 అడుగులు చేరింది. ఇన్‌ఫ్లో 10,282 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 9,352 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 355 అడుగులు కాగా నీటి సామర్థ్యం 300 టీఎంసీలు ఉంది. ఖమ్మం జిల్లా బేతుపల్లి చెరువు నుంచి వచ్చే అలుగునీరు తమ్మిలేరు వాగుద్వారా రిజర్వాయర్‌లోకి చేరుతోంది. ఐదు వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తే మొదటి ప్రమాద హెచ్చరిక, 10వేలు దాటితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తమ్మిలేరు ఎగువన శివపురం, చిన్నంపేట గ్రామాల మధ్య తమ్మిలేరు వాగుపై ఉన్న వంతెన పై నుంచి రెండు అడుగులకు పైగా వరద నీరు ప్రవహి స్తుండ డంతో రాకపోకలు బంద్ అయ్యా యి. ప్రాజెక్టు పరీ వాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు ఏఈ పరమానందం సూచించారు.


తమ్మిలేరు గేట్లుఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం


ముసునూరులో నీట మునిగిన పత్తి పంట


ఏలూరులో నీట మునిగిన శనివారపుపేట తమ్మిలేరు కాజ్‌వే


పెదపాడు మండలం తాళ్లమూడి వద్ద హైవేపై వరద నీరు

వైసీపీకి 14 మంది కార్పొరేటర్లు గుడ్‌బై

ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో టీడీపీ తీర్థం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 1 : ఏలూరులో వైసీపీకి మరోసారి భారీ షాక్ తగిలింది. ఇప్పటికే మేయర్ కొందరు కార్పొరేటర్లతో కలిసి ఇటీవల టీడీపీ గూటికి చేరగా తాజాగా అదేబాటలో ఆదివారం 14 మంది వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు, మహిళా కోఆప్షన్ సభ్యురాలు వైసీపీకి ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి లేఖలు రా శారు. వీరంతా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. వీరిలో కార్పొరేటర్లు జి.కనక నరసింహారావు, సబ్బన శ్రీనివాస్, తాము పద్మ, యర్రంశెట్టి నాగబాబు, గూడూరి రాజ్యలక్ష్మి, అన్నపనేని భారతి, గునుపూడి శ్రీనివాసరావు, ఉచ్చుల సుజాత సన్ని, కత్తిరి రామ్మోహన్‌రావు, యర్రంశెట్టి సుమన్, ఈదుపల్లి కల్యాణిదేవి, మహ్మద్ ఇలియాస్‌పాషా, నున్న స్వాతి శ్రీదేవి, దేవరకొండ శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యురాలు నీతా జైన్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా ఇప్పటికే కీలక నేతలు అంతా వైసీపీని వీడడంతో ఏలూరు నగరంలో దాదాపు వైసీపీ ఖాళీ అయింది. మిగతా కార్పొరేటర్లు సైతం టీడీపీ, జనసేన వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఆళ్ళ నాని వైసీపీకి రాజీనామా చేయడంతో నగరంలో ఆ పార్టీ కుదేలైంది. అనంతరం మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, వైసీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్ బొద్దాని అఖిలప్రియ పార్టీని వీడి టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఎమ్మెల్యే బడేటి చంటి నేతృత్వంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. 50 డివిజన్లు ఉన్న నగరపాలక సంస్థకు 2021లో జరిగిన ఎన్నికల్లో 47 స్థానాలను వైసీపీ, మూడు స్థానాలను టీడీపీ దక్కించుకుంది. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ వైపు వైసీపీ కార్పొరేటర్లు వలసలు ప్రారంభించారు.


ఎమ్మెల్యే చంటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు

ఏలూరు అభివృద్ధే నా లక్ష్యం : ఎమ్మెల్యే చంటి

స్నేహపూర్వక వాతావరణంలో ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి తాను రాజీలేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరులోని వివిధ డివిజన్‌లకు చెందిన 14 మంది కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యురాలు టీడీపీ క్యాంపు కార్యాల యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవ స్థలన్నీ నిర్వీర్యం చేస్తూ అరాచక పాలన సాగించిన జగన్ పాలన కు కూటమి ప్రభుత్వ పాలనకు మధ్యన ఉన్న బేధాన్ని గమనిం చుకున్న అనేకమంది ప్రజా మద్దతు ఉన్న టీడీపీలో చేరుతున్నా రన్నారు. టీడీపీ జెండా మోస్తూ పార్టీనే నమ్ముకున్న వారందరికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడు తూ నగరాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు కృషిచేస్తున్న ఎమ్మెల్యే వెంట నడిచేందుకు ముందుకు వచ్చామన్నారు. నగరాన్ని అగ్రభాగాన నిలిపేందుకు కృషిచేస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రక్షాళన..!



చర్యలు చేపట్టిన రాష్ట్రప్రభుత్వం
ఇప్పటికే డైరెక్టర్‌ను తప్పించి త్రిసభ్య కమిటీని నియమిస్తూ ఆదేశాలు

నూజివీడు, సెప్టెంబరు 1: ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దే దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, మెస్‌లో నాసిరకపు భోజనం, ఉడికి ఉడకని కూరలు, నీళ్ళచారు, పురుగుల అన్నం వండి వార్చటంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావ డం, మంత్రి కొలుసు పార్థసారథి రెండుసార్లు క్యాంపస్‌కు వచ్చి వివిధశాఖల అధికారులు ట్రిపుల్‌ఐటీలోని పరిస్థితిపై విచారణ చేపట్టినా మెస్‌లో భోజన సదుపాయాల కల్పన లో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో ట్రిపుల్‌ఐటీలోని సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అవుతూ నూజి వీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌ను తప్పిస్తూ ఆయన స్థానంలో త్రిసభ్య కమిటీని నియమించి చర్యలు చేపట్టింది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023, నవంబరులో వరంగల్ ట్రిపుల్ ఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.చంద్రశేఖర్‌రెడ్డిని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి నూజివీడు ట్రిపుల్‌ఐటీలో పరిపాలన బాధ్యతల కన్నా బయట పను లకే ఆయన ఆసక్తి చూపారు. ఫలితంగా ట్రిపుల్‌ఐటీలో పరిపాలన గాడి తప్పింది. అయినా ఆయన తీరు మారక పోవడంతో డైరెక్టర్‌ను తప్పిస్తూ రాష్ట్రప్రభుత్వం ఆదేశా లను జారీ చేసింది. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలో ప్రధాన ఉన్నతాధికారులు, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లల్లోనే రాజీనామా చేశారు. గత ప్రభుత్వం హయాంలో నియమితులైన ఈ అధికారులు వైసీపీ సాను భూతి పరులుగా ప్రచారంలో ఉంది. అయితే వారి రాజీ నామాల అనంతరం రాష్ట్రప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో యూనివర్సిటీలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడంలో వీరు తీవ్ర నిర్లక్ష్య ధోరణిని కనబరిచారు. చివరికి ఆర్జీయూకేటీ అడ్మిషన్ల ప్రక్రియ లోనూ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేదనే విమర్శ లున్నాయి. ఇక ఇటీవల ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అస్వస్థత కు గురికాగా ఆ విషయాన్ని కిందిస్థాయి సిబ్బంది ఆయన దృష్టికి వెళ్ళిన సందర్భంలోనూ, మెస్, భోజన సదుపాయా లు నాసిరకంగా పెడుతున్న విషయాన్ని ఇటు మెస్ కమి టీలు ఆయన దృష్టికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో తీసుకువెళ్ళినా ఆయన కనీసం చర్యలు తీసుకోలేదు. ఈ విషయాన్ని ట్రిపుల్ ఐటీలో పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన జేసీ ధాత్రిరెడ్డికి మెస్‌కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్తి ప్రక్షాళన అవసరం

ఉన్నత లక్ష్యంతో ఏర్పడిన రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్‌అండ్ టెక్నాలజీని పూర్తిగా ప్రక్షాళన చేయా ల్సిన అవసరం ఉంది. ఇక్కడ దాదాపు 95 శాతం మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ విధానంలో నియమితులైన వారే. చివరికి ఛాన్సలర్, వైస్‌ఛాన్సలర్, డైరెక్టర్లు అందరూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే. దీంతో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవటంలో యూనివర్సిటీకి లాభం కన్నా నష్టమే ఎక్కువ జరుగుతోందని చెప్పవచ్చు. ఈ పరిస్థితు లు మారాలంటే యూనివర్సిటీకి ఛాన్సలర్, వైస్‌ఛాన్స లర్లుగా సీనియర్ ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారులను నియమించడం ద్వారా యూనివర్సిటీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పిల్లల ఆరోగ్యంతో చెలగాటం వద్దు : మంత్రి లోకేశ్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో పిల్లల ఆరోగ్యాలతో చెలగాటం ఆడిన అధికారులను జైలుకు పంపటం జరుగుతుందని, రాష్ట్ర మానవవనరుల, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న ఉదం తం తెలియగానే వెంటనే కమిటీని పంపానని, శనివారం రాత్రి తనకు నివేదిక ఇచ్చింద న్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం సంబంధిత ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఇతర అధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

15 అడుగుల విగ్రహం రూ.40 వేలు

పాలకొల్లు అర్బన్ : లజయపతిరాయ పేట భీమ వరం రోడ్డు పక్కగా రాజస్థాన్‌కు చెందిన కళాకారుడు విక్రం పటేల్, రమేష్ 18 ఏళ్ళుగా విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాడు. అలాగే వర్ధనంకు చెందిన శిల్పి ఇంటి ప్రసాద్ లయన్స్ నగర్ ప్రాంతంలో గణనాథుల విగ్రహాలు తయారు చేస్తున్నారు. 15 అడుగుల విగ్రహం రూ.40 వేల వరకూ విక్రయిస్తున్నామని, ఇప్పటికే 100 విగ్రహాలకు ఆర్డర్లు వచ్చాయని తెలిపారు.



తాడేపల్లిగూడెం, ఆకివీడు, పాలకొల్లులో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథుని విగ్రహాలు





ఓ బొజ్జ గణపయ్య

- చవితికి గణనాథులు సిద్ధం
- విగ్రహ తయారీ కేంద్రాలకు పెరిగిన ఆర్డర్లు

తాడేపల్లిగూడెం రూరల్/ఆకివీడు రూరల్/ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 1: హిందువులు ఎంతో పవిత్రంగా జరుపుకునే వినాయక చవితికి బొజ్జ గణపయ్యలు సిద్ధ మయ్యారు. ఈ నెల ఏడు నుంచి ప్రారంభమయ్యే ఉత్స వాలకు మండపాలలో కొలువుదీసేందుకు ముస్తాబయ్యారు. ఐదు నుంచి 16 అడుగుల విగ్రహాల వరకూ జిల్లాలోనే లభ్యమవుతున్నాయి. విగ్రహాల సైజును బట్టి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ ధర పలుకు తున్నాయి. చవితి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణ నిలిచేది విగ్రహాలే. అలాంటి విగ్రహాల ఎంపిక కోసం నిర్వాహకులు ఉత్సాహం చూపుతుంటారు. దీంతో వారికి కావాల్సిన గణపతి విగ్రహాల కోసం వెతుకులాట జోరుగా సాగుతోంది. నచ్చిన విగ్రహాలకు అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం పాలకొల్లు లాంటి పట్టణాలతో పాటు మండల కేంద్రాలైన గణపవరం, ఆచంట, యలమంచిలి, ఆకివీడు తదితర ప్రాంతాల్లోని విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. కూటమి ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఆంక్షలు ఉండవని ఇప్పటికే సంకేతాలు ఇస్తుండ టంతో చవితి ఉత్సవ కమిటీల వారు ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. భారీ పందిళ్లు వేసేందుకు సిద్ధమయ్యారు. పలు సేవా సంస్థలు ఏకో గణపతి పేరుతో మట్టి విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు నగరంలోని కోటదిబ్బ సెంటర్, రామకోటి ప్రాంగణం, కూరగాయల మార్కెట్, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో భారీ గణనాథుని మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. గంగానది మట్టితో విగ్రహాలను కళాకారులు తయారు చేస్తున్నారు.

విక్రయాలు ఎక్కువగా ఉంటాయి



ఉత్సవాలు నిర్వహించాలను కునేవాళ్లు ముందస్తుగా మాకు ఆర్డరిస్తారు. ఈ సారి ఆర్డర్‌లు తక్కువగానే వచ్చా యి. సాధారణంగా చవితి దగ్గరకు వచ్చాక అమ్మే విగ్రహాలే ఎక్కువ. ఈ సారి గతంతో పోలిస్తే విగ్రహాల విక్రయాలు ఎక్కువగా ఉంటాయని ఆశిస్తున్నాం. **- ఫుల్ చంద్ రాథోడ్,**

వినాయక విగ్రహాల తయారీదారుడు, తాడేపల్లిగూడెం





రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : రాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో రైలు పట్టాలపైకి నీరు చేరిపోవడంతో ఎక్కడ రైళ్ళు అక్కడే నిలిచి పోతున్నాయి. మరి కొన్ని రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముందస్తు ప్రయాణికుల రక్షణ చర్యల్లో భాగంగా 80 రైళ్ళను రద్దు చేయగా, ఐదు రైళ్ళు కొంత వరకు మాత్రమే రద్దు చేశారు. మరో 49 రైళ్ళను దారి మళ్ళించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 10 గంటలకు రైల్వే అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు ఏలూరు జిల్లా మీదుగా వెళ్ళే రైళ్ళు రద్దు, దారి మళ్ళించిన రైళ్ళ వివరాలు ఇలా ఉన్నాయి.

20833	విశాఖపట్టణం	సికింద్రాబాద్ ఈనెల 2వ తేదీన రద్దు
20834	సికింద్రాబాద్	విశాఖపట్టణం ఈనెల 2వ తేదీన రద్దు
20707	సికింద్రాబాద్	విశాఖపట్టణం ఈనెల 2వ తేదీ రద్దు
20708	విశాఖపట్టణం	సికింద్రాబాద్ ఈనెల 2వ తేదీ రద్దు
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ శిర్డి ఈనెల 2వ తేదీ రద్దు
17205	సాయినగర్ శిర్డి	కాకినాడ పోర్టు ఈనెల 3వ తేదీన రద్దు
17209	ఎస్ఎంవీటీ బెంగళూరు	కాకినాడ టౌన్ ఈనెల 2వ తేదీన రద్దు
17717	విశాఖపట్టణం	విజయవాడ
	(విశాఖపట్టణం నుంచి నూజివీడు వరకు మాత్రమే)	
17488	విశాఖపట్టణం	కడప
	(విశాఖపట్టణం నుంచి సామర్లకోట వరకు మాత్రమే)	
17250	కాకినాడ టౌన్	తిరుపతి
	(కాకినాడ నుంచి రాజమండ్రి వరకు మాత్రమే)	

దారి మళ్లించిన రైళ్లు

విజయవాడ నుంచి నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు మీదుగా వెళ్ళే రైళ్ళను విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్ళించారు. అదే విధంగా నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, నూజివీడు, ఏలూరు మీదుగా వెళ్ళే రైళ్ళను నిడదవోలు నుంచి భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా దారి మళ్ళిస్తున్నారు.

12863	హౌరా	ఎస్ఎంవీటీ బెంగళూరు
18463	భువనేశ్వర్	కేఎస్ఆర్ బెంగళూరు
12717	విశాఖపట్టణం	విజయవాడ
18047	షాలిమారు	వాస్కోడిగామా
17488	విశాఖపట్టణం	కడప
12845	భువనేశ్వర్	ఎస్ఎంవీటీ బెంగళూరు
22504	డిబ్రుగర్	కన్యాకుమారి
12839	హౌరా	చెన్నై సెంట్రల్
22502	న్యూథిన్సుకీయ జెంక్షన్	ఎస్ఎంవీటీ బెంగళూరు
17250	కాకినాడ టౌన్	తిరుపతి
22880	తిరుపతి	భువనేశ్వర్
22808	చెన్నై సెంట్రల్	సత్రగంజి
12433	చెన్నై సెంట్రల్	నిజాముద్దీన్
22641	తిరువనంతపురం	షాలిమార్
22503	కన్యాకుమారి	డిబ్రుగర్

నరసాపురం రైళ్లు రెండు..

నరసాపురం, సెప్టెంబర్ 1: వర్షాలు, వరదల కారణంగా దక్షణ మధ్య రైల్వే ఆదివారం నరసాపురం నుంచి వెళ్లే రెండు రైళ్లను రద్దు చేసింది. వాటిలో రాత్రి ఎనిమిది గంటలకు వెళ్లే సికింద్రాబాద్ వీక్లి స్పెషల్, మధ్యాహ్నం రెండు గంటలకు వెళ్లే విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లున్నాయి. సోమవారం విజయవాడ నుంచి సాయంత్రం ఐదు గంటలకు బయలు దేరే డెమో రైలును కూడా రద్దు చేస్తున్నట్లు దక్షణ మధ్య రైల్వే ప్రకటిం చింది. ఇటు ఆదివారం లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు సాయం త్రం 6.50కి బయలుదేరాల్సి ఉంది. అయితే రాత్రి 8.50కు బయలుదేరింది. మరోవైపు విజయవాడ వైపు రైళ్లన్ని రద్దు కావడంతో నరసాపురం స్టేషన్ వెలవెలబోయింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు కూడా ఆలస్యంగా వచ్చాయి. చాల మంది హైదరాబాద్‌లో కూడా వర్షాల హెచ్చరిక జారీ చేయడంతో ఆదివారం టిక్కెట్లను రద్దు చేసుకున్నారు.

చిన్నారి జ్ఞానేశ్వరి మృతి



ఏలూరు అర్బన్, ఆగస్టు 1 : కాలేయ మార్పిడి(లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్ర చికిత్స చేయించుకుని, నెల రోజులుగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఏలూరుకు చెందిన బాలిక కోటం జ్ఞానేశ్వరి తమిళనాడులోని పెరుంబాక్కం గ్లెనిగల్స్ హెల్త్ సిటీ హాస్పిటల్‌లో శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కన్నుమూసారు. వివరాలను జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులు తెలిపారు. కామెర్లు ముదిరడంతో కాలేయ మార్పిడి తప్పనిసరి అని వైద్యనిపుణులు తేల్చిచెప్పడం, ఆ మేరకు లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ దాతలు, ప్రభుత్వ సహకారంతో బాలిక తల్లి దుర్గ కాలేయం నుంచి 40 శాతం మేర తొలగించి గత నెల 3న అమర్చారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఆస్పత్రిలోనే ఉన్నారు. కాగా మూడు రోజులుగా బాలిక అన్నవాహిక నుంచి విపరీతంగా రక్తస్రావం జరుగుతుండడంతో దానిని అరికట్టేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో శనివారం అర్ధరాత్రి తర్వాత ఆస్పత్రిలోనే జ్ఞానేశ్వరి మరణించిందని వైద్యులు తెలిపారు. బాలిక మృతదేహాన్ని చెన్నై నుంచి అంబులెన్సులో ఆదివారం అర్ధరాత్రికి ఏలూరు చేరుస్తామని, సోమవారం భీమడోలులో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యు లు తెలిపారు. తన కాలేయం నుంచి కొంత భాగాన్ని కుమార్తెకు డొనేట్ చేసిన తల్లి దుర్గ కోలుకుంటోందని వివరించారు.

తీవ్రంగా కలచివేసింది : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్ : చిన్నారి జ్ఞానేశ్వరి మృతిని తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి క్షేమంగా తిరిగి రావాలని సీఎం చంద్రబాబుతో మాట్లాడి ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సహాయం అందించామని, అయినప్పటికి విధి వక్రించి మృతి చెందటం బాధకరమన్నారు. జ్ఞానేశ్వరి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు గుండె ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానని చంటి అన్నారు.

స్తంభించిన సెల్ నెట్‌వర్క్



ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : సెల్ నెట్ వర్క్ సేవలు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు తమ ఫోను ఏమైందో, సిగ్నల్ ఎందుకు రావడంలేదో అంటూ స్విచ్ ఆఫ్ చేసి ఆన్ చేయగా మరి కొంతమంది రీసెట్ చేసుకున్నారు. అయినప్పటికీ సిగ్నల్ రాలేదు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టవర్స్ పని చేయడంలేదేమోనని అనుకున్నారు. అయినప్పటికీ అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ఒక్కసారిగా వారు తమ ఫోన్‌కు ఏమైందో అంటూ సిమ్ కూడా బయటకు తీసి మళ్ళీ పెట్టుకో వడం జరిగింది. అయినప్పటికీ సిగ్నల్ లేకపోవడంతో సిగ్నల్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఉదయం 12 గంటలకు ఆగిపోయిన సిగ్నల్ తిరిగి రెండు గంటలకు సిగ్నల్ అందింది. దీంతో హమయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు. రెండు గంటల పాటు నెట్‌వర్క్ లేక ఇబ్బందులకు గురయ్యారు. అన్ని ప్రాంతాల్లో ఇదే విధంగా జరిగినట్లుగా చెప్తున్నారు.

ఏకీకృత పింఛను వద్దు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ 1938 సంఘ నాయకులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 1 : కేంద్ర ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన ఏకీకృత పింఛన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్, ఏపీటీఎఫ్ 1938 ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులో వేర్వేరుగా ధర్నా, సమావేశాలు జరిగాయి. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఏపీటీఎఫ్ 1938 జిల్లా నాయకులు జి.కృష్ణ, రత్నంబాబు, మోహన్ మాట్లాడుతూ యూపీఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పింఛన్ విధానాలను తీసుకురావడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక 'ఇష్ట' జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సమావేశంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించేవరకు ఏపీటీఎఫ్ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయకుండా సర్‌ప్లస్ టీచర్ల పేరుతో సర్దుబాట్లు చేయడం తగదన్నారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ నాయకులు శాస్త్రి, రమాదేవి, ప్రకాష్, జగదీష్, దొరబాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రాజు, దుర్గారావు, సురేష్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాటదారుడికి రేవు అప్పగింత

నరసాపురం, సెప్టెంబర్ 1: మాధవాయిపాలెం రేవును ఆదివారం కొత్త పాటదారుడికి అప్పగించారు. జూలై మూడు నుంచి రేవు నిర్వహణను మండల పరిషత్ నిర్వహిస్తూ వస్తోంది. ఇటీవల నిర్వహించిన వేలంలో యలమంచిలి మండలం కనకాయలంక సొసైటీ రేవును రూ 2.98 లక్షలకు పాడుకుంది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ ఒకటి నుంచి అప్పగించాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో ఉదయం ఐదు గంటలకు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు, సిబ్బంది సురేష్ పాటదారుడికి రేవును అప్పగించారు.

మంత్రి లోకేశ్ దృష్టికి 'అపుస్మా' సమస్యలు : ఎమ్మెల్యే రోషన్‌కుమార్

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక

చింతలపూడి/ఏలూరు అర్బన్, సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) సమస్యలను విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ భరోసా ఇచ్చారు. అపుస్మా ఏలూరు జిల్లా సంఘ సమావేశం చింతలపూడిలో ఆదివారం జరిగింది. సంఘ నాయకులు ఆయనకు స్వాగతించి సత్కరించగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడారు. అపుస్మా పాఠశాలల సమస్యలు, పాఠశాల యాజమాన్యం నుంచి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ 42 శాతం విద్యను రాష్ట్రంలో బడ్జెట్ స్కూల్ రూపంలో అందిస్తున్నామని, ప్రైవేట్ విద్యా సంస్థలు పోటీ కాదని, ప్రభుత్వంతో కలిసి విద్యాభివృద్ధికి తాము తోడ్పడుతున్నామన్నారు. అనంతరం అపుస్మా జిల్లా శాఖ నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. వివరాలను ఏలూరులోని పత్రికలకు సంఘ నాయకులు విడుదల చేశారు. సంఘ జిల్లా నూతన అధ్యక్షుడిగా హయగ్రీవ విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శివ కుమార్ శర్మ, కార్యదర్శిగా ఎస్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారిగా కె.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని 600 ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు, కరస్పాండెంట్లు హాజరయ్యారని వివరించారు. అపుస్మా రాష్ట్ర అదనపు కార్యదర్శి డాక్టర్ ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తులసి విష్ణుప్రసాద్, జోన్-2 ప్రాంతీయ అధ్యక్షుడు జంగా బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సహ అధ్యక్షుడు జి.బుల్లబ్బాయ్ తదితరులు హాజరయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.



'అపుస్మా' జిల్లా నూతన కార్యవర్గ నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్,తదితరులు

విరాళాల వివరాలు సక్రమంగా ఉండాలి



భీమవరం టౌన్, సెప్టెంబరు 1 : శ్రీమావుళ్ళమ్మకి భక్తులు సమర్పించిన విరాళాల వివరాలు సక్రమంగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) హెచ్చరించారు. శ్రీమావుళ్ళమ్మవారి స్వర్ణ వస్త్రానికి పట్టణానికి చెందిన రెడ్డి శివశంకర్, రాధారాణి దంపతులు 15 గ్రాముల బంగారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా ఆదివాకం దేవస్థానంకు అందజేశారు. ఈ సందర్భంలో భక్తులందించే విరాళాల వివరాలను పరిశీలించి ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విరాళాలు అందించే భక్తుల పూర్తి వివరాలతో రికార్డులుండాలని, సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ కొండచరియ విరిగిపడిన ఘటనలో..

యువతి మృతి.. తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 1 : విజయవాడలో శనివారం కొండ చరియలు విరిగి పడిన ఘటనలో ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామానికి చెందిన నవుడు మేఘన (24) అనే యువతి మరణించింది. ఈమె విజయవాడలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో క్రెడిట్ కార్డు సెక్షన్‌లో పని చేస్తున్నది. తల్లిదండ్రులతో సహా ఈమె అక్కడే నివాసం ఉంటోంది. మరో పది నిముషాల్లో ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో కొండ చరియలు విరిగి పడి ఆ యువతి మృత్యువాత పడింది. మృతురాలి తల్లిదండ్రులకు కూడా తీవ్ర గాయాలై నడవ లేని స్థితిలో ఉన్నారు. ఈ ఘటన వణుదుర్రు వాసులను విషాదంలో నింపింది. ఆదివారం మేఘన అంత్యక్రియలను వణుదుర్రులో నిర్వహించారు. ఆమె తల్లిదండ్రుల వేదన చూపరుల హృదయాలను కలచి వేసింది. పలువురు మేఘన కుటుంబాన్ని పరామర్శించారు.

తిరుపతి రైలు ఆకస్మిక రద్దు

- రాజమండ్రిలో నిలిపివేత
- 1500 మంది ప్రయాణికుల అగచాట్లు



రాజమండ్రిలో వెనుదిరుగుతున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఆటంకం ఏర్పడింది. గన్నవరం-విజయవాడ మధ్య రైల్వే ట్రాక్ నీట మునగడంతో కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలు రాజమండ్రిలో రద్దు చేశారు. రైల్వే ఆకస్మిక నిర్ణయంతో దారి మధ్యలోనే ప్రయాణం ఆగిపోవడంతో ఉసూరుమన్నారు. సాధారణంగా తిరుమలకు వివిధ ప్రాంతాల నుంచి బృందాలుగా ఏర్పడి వెళుతుంటారు. దీంతో మరింత ఇబ్బంది పడ్డారు. కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలు కాకినాడ నుంచి ఆదివారం సాయంత్రం బయలు దేరింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో రాజమండ్రి చేరుకుంది. ఎంత సేపటికీ బయలు దేరకపోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన మొదలైంది. రైలును దారి మళ్లిద్దామనుకొని తాడేపల్లిగూడెం, ఏలూరు ప్రయాణికులు దిగిపోవాలని చెప్పారు. కానీ రైలును రద్దు చేస్తున్నట్టు 6.30 గంటల సమయంలో ప్రకటించారు. 11 స్లీపరు, ఆరు ఏసీ, రెండు జనరల్ బోగీల్లో సుమారు 1500 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది తిరుమల వేంకటేశ్వరుడి దర్శనానికి వెళ్లేవారు. రైలు ఆకస్మిక రద్దు ప్రకటనతో దర్శనం కోల్పోయామనే బాధ ప్రయాణికుల్లో కనిపించింది. కొందరు ప్రయాణి కులు రైల్వే స్థానిక సిబ్బందితో వివాదానికి దిగారు. టీసీ ఐ.చంద్రమౌళి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధించినట్లే రైలును ఆకస్మికంగా దారి మధ్యలో నిలిపేస్తే తమకూ పరిహారం చెల్లించాలని వాదించారు.

రిఫండ్‌కీ ఇబ్బందే

మాన్యువల్‌గా రిజర్వేషను టికెట్లు తీసుకున్నవాళ్లు రిఫండ్ కోసం రిజర్వేషను కౌంటర్ల వద్దకు వెళ్లాలని సిబ్బంది సూచించారు. అయితే అక్కడ మూడే కౌంటర్లు ఉండడం, రాజమండ్రి రిజర్వేషను కార్యాలయంలో తీసుకున్న టికెట్లను మాత్రమే రద్దు చేస్తామని చెప్పడంతో ప్రయాణికులు మరీ నీరసించిపోయారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి మరీ బాధించింది. తిరుగు ప్రయాణంలో టికెట్లు ఉన్నవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆ టికెట్లకు క్యాన్సిలేషన్ చార్జీలు వసూలు చేయకుండా చూడాలని కోరారు.

క్రైం కార్నర్

స్విమ్మింగ్ పూల్‌లో దిగి ఒకరి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : స్విమ్మింగ్ పూల్‌లో దిగిన యువకుడు ఈత రాకపోవడంతో మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన అక్కినేని నగేష్ (32) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వేరేవారి పిల్లలను వట్లూరులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌కు తీసుకువెళ్తూ ఉంటాడు. ఆదివారం కూడా తీసుకు వెళ్ళాడు. అతను కూడా స్విమ్మింగ్ పూల్ దిగి లోతుకు వెళ్ళాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. అపస్మారక స్థితికి వెళ్ళగా వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్ళారు. అప్పటికే మృతి చెందాడని నిర్ధారించి ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 :రోడ్డుపై నడిచి వెళ్తున్న ఒక వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తర లిస్తు ండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నల్లజర్ల మండలం పోతవరం గ్రా మానికి చెందిన గోవాడ గంగరాజు (60) గత నెల 31వ తేదీ రాత్రి గ్రామం లో రోడ్డుపై నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దివ్యాంగ ఆ టో డ్రైవర్ తన ఆటోతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన గంగరాజును ఏలూరు ప్రభుత్వాస్పతికి శనివారం అర్ధరాత్రి తరలించారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని చెప్పారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ అరెస్టు... బంగారం, వెండి స్వాధీనం

పోలవరం సెప్టెంబరు 1 : మండలంలో పలు ప్రాంతాల్లోని ఇళ్ళలో దొంగతనాలు చేసిన దొంగను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. తాళాలు బద్దలు కొట్టి ఇళ్లల్లోకి ప్రవేశించి బీరువాల్లోని బంగారం, వెండి చోరీలకు పాల్పడిన కేసులలో దర్యాప్తు చేశామన్నారు. పోలవరం మండలం గూటాల పంచాయతీ మహాలక్ష్మి పేటకి చెందిన తాడి దుర్గారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి విచారించగా నాలుగు చోట్ల దొంగత నాలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. 2023 జూన్‌లో గూటా శివయ్య స్వీట్ షాపు యజమాని ఇంట్లో, 2023 ఆగస్టు, డిసెంబరులో, 2024 ఆగస్టులో పలు ఇళ్ళలో దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. చోరీ చేసిన బంగారం, వెండి ముత్తూట్, మణప్పురం, అమృతాగోల్డ్ వంటి సంస్థలలో తాకట్టు పెట్టడం అమ్మడం చేసి డబ్బు చేసుకుని వ్యసనాలకు ఖర్చు చేయ డం చేసేవాడని తెలిపారు. మొత్తం కేసులలో 360 గ్రాముల బంగారం, 452 గ్రాముల వెండి వస్తువులు దొంగిలించబడ్డాయని, నిందితుడి వద్ద 48 గ్రాముల బంగారం, 252 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామి తెకలిపారు. సీఐ బాల సురేష్ బాబు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, రైటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గేదెలు మొక్కలు తినేశాయని.. ఒకరిపై ఒకరు కేసులు

లింగపాలెం, సెప్టెంబరు 1: గేదెలు వచ్చి ఇంట్లోని మొక్కలను తినివేశాయని, ఇద్దరు వ్యక్తులు కొట్టుకున్న ఘటన లింగపాలెం శివారు కల్యాణంపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం, లింగపాలెం శివారు కల్యాణంపాడుకి చెందిన ఇద్దరు వ్యక్తులు తమ ఇంట్లోకి గేదెలు వచ్చి మొక్కలు తినేశా యని గొడవపడడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వీరు ఇరువురు పరస్పరం ఒకరి పై ఒకరు కేసులు పెట్టుకున్నారని ఎస్సై వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం సెప్టెంబరు 1 : కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, మరో ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. కుర్సం నవ్య సింధూర్ పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త సింధూర్ మద్యానికి బానిసై నవ్యను శారీరకంగాను, మానసికంగాను వేధిస్తుండడంతో నవ్య పిల్లలతో జంగారెడ్డిగూడెం వచ్చి నివాస ముంటు న్నారు. గత నెల 29న నవ్య దగ్గరకు ఆమె భర్త సింధూర్ మద్యం సేవించి వచ్చి డబ్బులిస్తావా లేదా అంటూ పిల్లలను తీసుకువెళ్తుండగా అడ్డుకున్న నవ్యను సింధూర్ రాడ్డుతో కొడుతుండగా నవ్య చెయ్యి అడ్డు పెట్టగా ఆమె ఎడమ కంటికి తగిలి గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఆమె భర్తతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జామాయిల్ తోట ధ్వంసం.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం సెప్టెంబరు 1 : పట్టణంలోని ఓ మహిళకు చెందిన ఐదెకరాల జామాయిల్ తోటను ధ్వంసం చేసినందుకు ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. పట్టణంలోని ఆర్ఎస్ నెంబర్ 228-27లో పట్టణానికి చెందిన దండమూడి లక్ష్మీజ్యోతికి ఐదెకరాల జామాయిల్ తోట ఉంది. తమ పొలంలో ఉన్న జామాయిల్ తోటను జేసీబీతో ధ్వంసం చేసిన ముగ్గురిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మద్యం మత్తులో.. పెట్రోలు పోసుకుని..

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 1 : మద్యం మత్తులో ఒక వ్యక్తి పెట్రోల్ పోసు కుని నిప్పటించుకున్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏలూరు తంగె ళ్ళమూడికి చెందిన వేల్పూరి ఉమామహేశ్వరరావు (49) ఆదివారం సాయ ంత్రం మద్యం తాగిన పెట్రోల్ తనపై పోసుకుని నిప్పంటించుకున్నా డు. తీవ్ర గాయాలపాలైన అతడిని బంధువులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘట నపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్ పోస్టు పోలీసుల కు సమాచారం ఇచ్చారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆకివీడు, సెప్టెంబరు 1 : అయి-భీమవరం గూడౌన్స్ దగ్గర ఖాళీ స్థలంలో ఆదివారం పేకాటాడుతున్న నల్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ 22,250లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ హనుమంతు నాగరాజు తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ.. ఒకని మృతి



మృతుడు సైకం నాగరాజు

భీమవరం క్రైం, సెప్టెంబరు 1 : ఇరువురు మధ్యతలెత్తిన వివాదం ఒకరు మృతికి దాకితీపింది. టూ టౌన్ సీఐ కాళీచరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉనాయి. భీమవరంలోని గరగపర్రురోడ్డులో సైకం నాగరాజు అనే వ్యక్తికి టింక్కరింగ్ షాపు ఉంది. ఆ పక్కనే ఉన్న పెయింటింగ్ షాపులో గతంలో ఆకుల తులసీ వరప్రసాద్ (నాని) అనే వ్యక్తి పనిచేసేవాడని, అక్కడ మాని వేశాడని, అతను మద్యానికి బానిసై తగాదాలు పడుతూ ఉంటాడాన్నారు. గతంలో చాలాసార్లు నాగరాజువద్దకు వచ్చి వరప్రసాద్ సొమ్ములు డిమాండ్ చేసేవాడని, ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో షెడ్డు వద్దకు వచ్చి సొమ్ములు కావాలని అడగడంతో నాగరాజు నీకు ఎందుకు ఇవ్వాలనడంతో తులసీ వరప్రసాద్ వెళ్ళిపోయాడన్నారు. రాత్రి 8.30 ప్రాంతంలో మరలా వచ్చిన వరప్రసాద్ నాగరాజుతో ఘర్షణకు దిగి వెంటన తెచ్చుకున్న కత్తితో నాగరాజు పొట్టలో పొడిచాడన్నారు. వెంటనే నాగరాజు కూడా షెడ్డులో ఉన్న ఇనుపరాడ్‌తో వర ప్రసాద్ తలపై బలంగా కొట్టాడాన్నారు. దీంతో స్థానికంగా ఉన్న కొందరు షెడ్డు వద్దకు చేరుకుని గాయాలబారిన పడిన ఇరువురిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఐతే అప్పటికే నాగరాజు (34) మృతి చెందగా, వరప్రసాద్ తీవ్ర గాయాలతో కోమాలో ఉన్నాడని సీఐ తెలిపారు. కేసును టూటౌన్ సీఐ కాళీచరణ్ దర్యాప్తు చేస్తున్నారు.






పెదపాడు మండలం పునుకొల్లు సమీపంలో పంట చేల మీదుగా కృష్ణా కాలువలో చేరుతున్న నీరు, తాళ్లమూడిలో నీట మునిగిన ఎస్సీ కాలనీ, అప్పనవీడు జాతీయ రహదారిపై వరద నీరు, ఏలూరు శనివారపు పేట కాజ్‌వే వద్ద ఆదివారం సాయంత్రం వరద ఉధృతి

జలమయం

• జిల్లాలో భారీ వర్షం • పొంగిన కాల్వలు, చెరువులు • పలుచోట్ల గండ్లు • మునిగిన ఇళ్లు, చేలు



కలపర్రు దాటిన తర్వాత జాతీయ రహదారిపై వరద



హనుమాన్ జంక్షన్ సమీపంలో నీట మునిగిన చేలు



చింతలపూడి మండలం శివపురం వద్ద ఎమ్మెల్యే పరిశీలన



దెందులూరు సత్యనారాయణపురం వద్ద కాజ్‌వే వద్ద వరద



కుక్కునూరులో కిన్నెరసాని ఉధృతికి మునిగిన పంటలు



లింగపాలెం అన్నపనేనివారిగూడెంలో ఇంటి చుట్టూ నీరు

పెదపాడు, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో కాలువలు, చెరువులు పొంగుతున్నాయి. గండ్లు పడి వరదనీరు ఊళ్లను ముంచేస్తుందన్న పిడుగులాంటి వార్త గాఢనిద్రలో వున్నవారిని ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురి చేసింది. కృష్ణాజిల్లా, నూజివీడు సరిహద్దు ప్రాంతాల్లోని చెరువులు, రామిలేరు పొంగిపొర్లడంతో సరిహద్దు ప్రాంతంలో పెదపాడు మండలం అప్పనవీడు, తాళ్లమూడి గ్రామాల్లోకి శనివారం అర్ధరాత్రి వరదనీరు ప్రవేశించింది. బొమ్ములూరులో జాతీయ రహదారి నీట మునిగింది. వరద సమాచారం అందుకున్న ఎమ్మెల్యే చింతమనేని హుటాహుటిన అధికారులను, స్థానిక నాయకులను అప్రమత్తం చేసి స్వయంగా సహాయక చర్యలు చేపట్టారు. వరదనీటితో జగనన్న కాలనీలు, ఎస్సీ కాలనీలు నీటిమునిగిపోయాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి బోట్లలో కాలనీల వాసులను వెయ్యి మందిని పునరావాస కేంద్రానికి తరలించేలా ఎమ్మెల్యే ప్రభాకర్ చర్యలు తీసుకున్నారు. పునరావాస కేంద్రంతో పాటు ఇళ్ల నుంచి బయటకు రాని వారికి అల్పాహారం, పాలు, ఆహార పదార్థాలను అందించే ఏర్పాట్లు చేశారు. స్వయంగా బోటులో వెళ్లి కాలనీవాసుల యోగాక్షేమాలను, పరిస్థితిని ఎమ్మెల్యే చింతమనేని అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాలను పోలీసులు నిలుపుదల చేశారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు జాతీయరహదారిపై నిలిచిపోయాయి. రహదారిపై నిలిచిన వాహనదారులకు కూడా ఎమ్మెల్యే చింతమనేని అల్పాహారం అందజేశారు. పైనుంచి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో జేసీబీలను రప్పించి కల్వర్టుల వద్ద, తూముల వద్ద పూడికలు తీయించి నీరు కిందికి పోయేలా పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. రహదారిపై ఆటో బోల్తాపడడంతో స్థానికులతో కలిసి ఎమ్మెల్యే సహాయక చర్యలు చేపట్టారు. హైవే అంబులెన్స్ సిబ్బందిని అప్రమత్తం చేసి ఆసుపత్రికి తరలించే చర్యలు తీసుకున్నారు.

కలెక్టర్ వెట్రిసెల్వీ, ఎస్పీ కె.ప్రతాపశివకిశోర్, జేసీ ధాత్రి రెడ్డితో కలిసి నీటిమునిగిన కాలనీలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరిశీలించారు. వరద పరిస్థితి, ముంపునకు గల కారణాలను కలెక్టర్‌కు వివరించారు. అప్పనవీడు, తాళ్లమూడి ప్రాంతాల్లో నీటిమునిగిన ప్రాంతాలను, సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతితో ఏలూరు కృష్ణా పక్కనే పంట పొలాలు నీట మునిగాయి. తోటగూడెం, పునుకొల్లు వద్ద కాలువ గట్లకు గండ్లు పండడంతో నీరు ఉధృతంగా ప్రవహించింది. సమీప ప్రాంతాల్లోని వరి, పామాయిల్ పంటలు నీట మునిగాయి. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో రామిలేరు ఉధృతంగా ప్రవహించింది.

వరద ఉధృతితో చెరువులు పొంగి పొర్లడంతో చెరువుల్లోని చేపలు బయటకు కొట్టుకు వచ్చాయి. వరదనీరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో ఆ నీటిలో వెళుతున్న చేపలను పట్టుకునేందుకు స్థానిక యువకులు పోటీ పడ్డారు.

ముంపు ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు మండల ప్రత్యేకాధికారి, డీపీవో తూతిక విశ్వనాథ్ తెలిపారు. గోగుంట పునరావాస కేంద్రం ఏర్పాటుతో పాటు ఖాజీగూడెం, సత్యవోలు, కడిమికుంట, కొణికి, గుడిపాడు, వడ్డిగూడెం తదితర గ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు. పెదపాడు-వట్లూరు రహదారిలో కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తుండటంతో మార్గాలను మూసివేసి రెవెన్యూ సిబ్బందిని గస్తీ ఉంచినట్లు తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు.

● ఏలూరు టూటౌన్ / రూరల్: భారీ వర్షాలకు నగరంలో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తంగెళ్లమూడి, సత్రంపాడు, శనివారపుపేట, వెంకటాపురం, పోణంగి ప్రాంతాల్లో ఖాళీ స్థలాలన్ని చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతున్నాయి. నగరంలో వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి డ్రైన్లలో ఉన్న పూడికతీసి మురుగు, వర్షపునీరు బయటకు పంపే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏలూరు రూరల్ రూరల్ మండలంలో వరి చేలు నీట మునిగాయి. పాలగూడెం, లింగారావుగూడెం, జాలిపూడి, కాట్లంపూడి ప్రాంతాల్లో వర్షం నీరు బయటకు వెళ్ళే మార్గం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరులో తమ్మిలేరు జలాశయానికి వరదముంపు పొంచి ఉంది. నాగిరెడ్డిగూడెం రిజర్వాయర్ నుంచి బారీగా నీటిని విడుదల చేయడంతో శనివారపుపేట కాజ్‌వేపై వరద నీరు చేరే అవకాశం ఉండటంతో అధికారులు చర్యలు చేపట్టారు.

● దెందులూరు: కాల్వలు పొంగి సత్యనారాయణపురం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గుండేరు వాగు కాజ్‌వేపై నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వస్తుండడంతో గ్రామంలో ఉన్న వారు బయటకు వచ్చేదుకు అవకాశం లేదు రెండు రోజులుగా సత్యనారాయణపురం గ్రామస్తులు ఇళ్లలోనే ఉండిపోయారు. మండల ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీలత వాగు పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా ఎవరు రాకపోకలు సాగించకుండా ప్రభుత్వ సిబ్బందిని ఏర్పాటు చేశారు. పోతునూరు, కొవ్వలి, సత్యనారాయణపురం, పాలగూడెం, మొండికోడు గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల వరి పొలాలు నీట మునిగాయి. గోపన్నపాలెంతో పాటు పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుండి అధికారులు గ్రామాల్లో వరదా పరిస్థితులను తెలుసుకుంటున్నారు.

● బుట్టాయగూడెం: ఏజెన్సీలో వర్షాలకు కొండవాగులు పొంగుతాయని, అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో అద్దన్న అధికారులకు సూచించారు. రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు కొండవాగుపై నిర్మించిన కల్వర్టును ఆర్డీవో స్వయంగా పరిశీలించారు. శనివారం రాత్రి నుంచి తెల్లవారుజామువరకు స్పెషల్ ఆఫీసర్ కుమార్, తహసీల్దార్ రమేష్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది వాగుల వద్ద పరిస్థితిని పర్యవేక్షించారు.

● లింగపాలెం: మండలంలోని అన్నపనేనివారిగూడెంలో ఇళ్లు నీటమునిగాయి. అయ్యప్పరాజుగూడెం, యడవల్లి, చెన్నుగూడెం, బోగోలు గ్రామాల్లో 25 ఎకరాలకు పైగా వరి నీటమునిగింది. ఎమ్మెల్యే రోషన్‌కుమార్, ముంపు గ్రామాలను పరిశీలించి వరదనీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధర్మాజీగూడెంలో ఎమ్మెల్యే ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ధర్మాజీగూడెం నుం చి జీలకర్రగూడెం రహదారిలో యర్రవారిగూడెం వద్ద కల్వ ర్టు వరద నీటికి కోతకు గురైంది. భారీ వాహనాలను, రాక పోకలను నిలిపివేశారు. ఆర్అండ్‌బి ఏఈ సుందర్‌రావు, ఈఈ కిశోర్‌బాబు కల్వర్టును పరిశీలించారు.

● కామవరపుకోట: గుర్రాలచెరువు పరిధిలో నీట మునిగిన వరి చేలను ఏవో సి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు. ఏవో ఉషాకుమారి, అనూష, తదితరులు పాల్గొన్నారు. రావికంపాడు, గుంటుపల్లి, కామవరపుకోట, కె.ఎస్.రామవరం గ్రామాల్లోని 350 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు గుర్తించినట్లు చెప్పారు.

● ఉంగుటూరు: మెట్ట ప్రాంతంలో వరద పరిస్థితిని ఆదివారం మండల ప్రత్యేకాధికారి డీఎల్‌డీవో విజయలక్ష్మి మండల అధికారులతో సమీక్షించారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో చెరువులు ఉధృతంగా ప్రవహించే ప్రమాదముందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో హనుమ, వీఆర్వోలు పాల్గొన్నారు.

● పోలవరం: పోలవరం ఏజెన్సీ గ్రామాల్లో సున్నాలగండి కాలువ, గుంజవరం కాలువ, జిల్లేల్లగూడెం కాలువ, నక్కల కాలువలు పొంగి కల్వర్టుల ద్వారా దిగువకు ప్రవహిస్తున్నాయి. ప్రజలు కొండవాగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కొండవాగుల ఉధృతంగా ప్రవహిస్తున్న సందర్భాల్లో వాగుల దాటే ప్రయత్నాలు చేయరాదని ఎస్ఐ పవన్ కుమార్ హెచ్చరికలు జారీ చేశారు.

● చింతలపూడి: తమ్మిలేరు ఎగువ, దిగువ పరివాహక ప్రాంతాలను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పరిశీలించారు. ఎగువ శివపురం వద్ద వరద పరిస్థితిని సమీక్షించారు. శివపురం, చిన్నంపేట మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. వంతెనపై ఎవరు ప్రయాణించవద్దని, మల్లేశ్వరం కాజ్‌వే పై ఎవరు తిరగవద్దని హెచ్చరించారు. ఇక్కడ పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని సీఐ రవీంద్రనాయక్‌కు సూచించారు.

● కుక్కునూరు: మండలంలో భారీ వర్షానికి రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. తెలంగాణలో కిన్నెరసాని ప్రాజెక్టు 12గేట్లు ఎత్తివేయడంతో సీతారామనగరం పంట పొలాలు నీట మునిగాయి. వంద ఎకరాల్లో ఉన్న పత్తి, వరి పొలాల మీదుగా కిన్నెరసాని ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో నరసింహరావు, ఏవో బాలాజీ పరిశీలించారు. సీతారామనగరం గ్రామస్థులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమస్య ఎదురైన తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 8309703949కు ఫోన్ చేయాలని కోరారు.

● వేలేరుపాడు: భారీ వర్షాలతో పెదవాగుకు వరద పోటెత్తింది. కొండవాగులు, కాల్వల నీటితో పెదవాగు కలవడంతో ఉగ్రరూపం దాల్చింది. వసంతవాడ, మద్దిగట్ల ఆర్అండ్‌బీ రహదారి వేలేరుపాడు, రుద్రమ్మకోట రహదారి వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయాయి.



పెదపాడు మండలంలో ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న వరద



అప్పనవీడులో విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద వరద నీరు



ఏలూరు మండలంలో నీట మునిగిన చేలు



ఉంగుటూరు మునిగిన చేలు పరిశీలిస్తున్న అధికారులు



కామవరపుకోటలో నీట మునిగిన పొలాలు



పెదపాడు మండలంలో డ్రైయిన్ల పూడిక తొలగింపు

నగరంలో తమ్మిలేరు ఉధృతిని పరిశీలించిన ఐజీ, ఎస్పీ



శనివారపుపేట కాజ్‌వే వద్ద పోలీసు గస్తీ

ఏలూరు క్రైం: నగరంలోని శనివారపుపేట కాజ్‌వే, తమ్మిలేరు వాగు, తంగెళ్లమూడి ప్రాంతాల్లో తమ్మిలేరు బ్రిడ్జిలను ఐజీ జీవీజీ.అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్‌కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదివారం పరిశీలించారు. రామిలేరు, తమ్మిలేరు, వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఈ మార్గాల్లో అత్యవసర ప్రయాణాలు మినహా ఎవరు ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో పికెట్లను ఏర్పాటుచేసి ప్రజలను అప్రమత్తం చేశామని ఐజీ వివరించారు. అధికారులు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు నిర్వహిస్తున్నా రని ప్రజలు సహకరించాలని సూచించారు. తమ్మిలేరు కాలువ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఎస్పీ కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి కోరారు. డ్రోన్ కెమెరాలతో శనివారపుపేట కాజ్‌వే తంగెళ్ళమూడి నుంచి ఎస్ఎంఆర్ నగర్ రోడ్డును, తూర్పు, పడమర లాకులు, వైఎస్ఆర్ కాలనీ ప్రాంతాలను పరిశీలించారు.

ఆదివారం సాయంత్రానికి శనివారపుపేట కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహించడంతో ఏలూరు- శనివారపుపేట మార్గాలకు రాకపోకలు నిలిపివేసి రెండు వైపులా పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. కొత్త బస్టాండ్ బ్రిడ్జి దాటిన తరువాత టీటీడీ కల్యాణమండపం మీదుగా, గ్జేవియర్ నగర్, గవరవరం, సెయింట్ ఆన్స్ కాలేజీ మీదుగా శనివారపుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. కాజ్‌వేపై రాకపోకలను మూసివేసి పోలీసు పహరా నిర్వహిస్తున్నారు.



తమ్మిలేరు ఉధృతి పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ, జేసీ

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న గన్ని వీరాంజనేయులు

ఉంగుటూరు, సెప్టెంబరు 1: చంద్రబాబు నాయుడు మొదటిసారి ముఖ్యమంత్రిగా పదవీ చేపట్టి ముప్పై ఏళ్లయిన సందర్భంగా నారాయణపురంలో ఆయన చిత్రపటానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆదివారం పాలాభిషేకం చేశారు. సర్పంచ్ దిడ్ల అలకనంద, సప్పా వీరబాబు, నల్లా ఆనంద్, పాతూరి సత్యనారాయణ, కాజా శ్రీనివాసరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, తదితరులు చంద్రబాబుకు జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

● టి.నరసాపురం: చంద్రబాబునాయుడు తొలిసారి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి 30 ఏళ్లు కావడంతో తిరుమలదేవిపేటలో తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాజుపోతేపల్లిలో నల్లూరి చలపతిరావు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు.

పవన్ కల్యాణ్ అభిమానుల రక్తదానం



రక్తదాన శిబిరం ప్రారభించిన ఎమ్మెల్యే ధర్మరాజు

నిడమర్రు, ఆగస్టు 1: రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేయ గల నాయకుడు పవన్‌కల్యాణ్ అని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఆదివారం రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 70 మంది రక్తదానం చేశారు. కంటి, చర్మవ్యాధి, షుగర్ వ్యాధి నిపుణుల సుమారు 200 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వట్టి పవన్, వంగా రఘు, చింతలపాటి బాసిరాజు, అల్లుమోలు అరుణ్ కుమార్, నిమ్మల దొరబాబు, అల్లుమోలు రామచరణ్, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా భీమడోలులో ప్రత్తి మదన్ ఆధ్వర్యంలో జనసేన, రెడ్‌క్రాస్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు రక్తదాన శిబిరం ప్రారంభించారు. 51 మంది అభిమానులు రక్తదానం చేశారు.

● ఏలూరు రూరల్: నగరంలోని 12వ డివిజన్ దక్షిణపువీధి, అగ్గాల వారివీధిలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా సంఘ సేవకుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్, పేదలకు నిత్యావసర వస్తువులు అందచేశారు. జనసేన నాయకులు రెడ్డిఅప్పలనాయుడు ఆధ్వర్యంలో తొలుత కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్.కాశీనరేష్, వీరంకి పండు, రెడ్డిగౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంలో కలుపు నివారణ



పవర్ వీడర్ పరిశీలిస్తున్న డీపీఎం

పెదవేగి, సెప్టెంబరు 1 : కలుపు నివారణకు సేంద్రియ విధానాలు అవలంబించాలని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా వ్యవసాయశాఖాధికారి (డీపీఎం) వెంకటేశ్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ, భూసార సంరక్షణ, ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు దోహదపడాలని ఆయన సూచించారు. అంకన్నగూడెంలో పవర్ వీడర్ (కలుపు నివారణ యంత్రం) తిప్పి కలుపు నివారణ పనులు చేపట్టారు. రసాయనిక ఎరువుల వాడకంతో అనర్థాలు, ప్రకృతి సాగు విధానంతో కలిగే లాభాలను వివరించారు. నాట్లు వేసిన 15, 30, 45 రోజుల వ్యవధిలో పవర్ వీడర్ తిప్పడంద్వారా రసాయనాలు వాడకుండా కలుపు నివారించవచ్చని, వరి పిలకలు మెండుగా వచ్చి దుబ్బు పరిమాణం పెద్దదిగా వస్తుందని ఆయన చెప్పారు. జె.సతీష్, ఎన్ఎఫ్ఎ, డీపీఎం సిబ్బంది, ప్రకృతి సాగు రైతు పి.సరోజిని, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 1: మండలంలోని మైసన్నగూడెం, అగ్రహారం గ్రామాల శ్మశాన వాటికలో నీరు, విద్యుత్, రహదారి సౌకర్యాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ కోరారు. ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సమస్య పరిష్కరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే జరిపించి ప్రత్యామ్నాయం చూపాలని, శ్మశాన వాటిక ఆధునీకరణకు రూ.పది లక్షలు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పిల్లి సీతారాములు, సుబ్బారావు, అర్జున్, పవన్, చిన్నబాబు పాల్గొన్నారు.

వ్యాపారులు ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 1: ఆహార సంబంధిత వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. 13 ఆహార సంబంధిత కేసులను విచారించి రూ.1,15,510 జరిమానా విధించారు. ఆహార భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నియమాలు ఉల్లంఘిస్తే కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నటుడు, దర్శకుడు బాలయ్య మృతి తీరనిలోటు

టి.నరసాపురం, సెప్టెంబరు 1: సీనియర్ నటుడు, దర్శకుడు బాలయ్య మృతి కళారంగానికి తీరనిలోటని ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ టీవీఎస్ రాజు అన్నారు. బాలయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం నివాళులర్పించారు. వీరమల్లు సత్యనారాయణ, ఎల్.ఆర్ కృష్ణబాబు, ఎం.ప్రేమానందం, విభూది రాజేశ్వరి, బొందలపాటి పద్మావతి, చిలుకూరి సుబ్బయ్య చారి, మధు, తమ్మిశెట్టి సత్యనారాయణ, తిరుపతి రమేష్‌బాబు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరించాలి



లోకేశ్‌తో బోళ్ళ రాజీవ్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 1: రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిలో పారిశ్రామిక వేత్తలంతా ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి నారా లోకేశ్ కోరినట్లు బోళ్ళ రాజీవ్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లో లోకేశ్‌ను ఆదివారం ఆయన కలిశారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వేత్తలంతా ప్రభుత్వానికి పూర్తిగా సహకరించాలని కోరారన్నారు. అందుకు బోళ్ల రాజీవ్ తప్పని సరిగా ప్రభుత్వానికి సహకరిస్తామని తెలియచేసినట్టు చెప్పారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, సెప్టెంబరు 1: రాట్నాలకుంట రాట్నాలమ్మకు భక్తులు ఆదివారం విశేష పూజలు చేశారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అమావాస్య ముందు ఆదివారం కావడంతో భక్తుల సంఖ్య తగ్గింది. అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా రుసుముల ద్వారా రూ.30,600, లడ్డూ ప్రసాదాల విక్రయాలతో రూ.16,155, ఫోటో విక్రయాల ద్వారా రూ.1555 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళాలు సమర్పించాలన్నారు.

విద్యా వైజ్ఞానిక శిక్షణ జయప్రదం చేయండి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 1: అనంతపురంలో సోమవారం నుంచి 5 వరకు జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను, జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ కోరారు. శిక్షణ తరగతుల పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు లేవని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసి వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయన్నారు. జనరల్ కౌన్సిల్‌లో విద్యారంగ సమస్యలను చర్చించి కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. సీతారామరాజు, టి.కార్తీక్, కె.శివమణి, పి.నవీన్, ఇ.కార్తీక్, పి.అభిలాష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 1: శనివారపుపేట గవరవరంలోని హజరత్ సయ్యద్ జమాల్షా బాబా ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్వర్ షరీఫ్ వంశపారంపర్య ముతావల్లి, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గంధం ప్రత్యేక బిందెలతో నింపి పూలమాలలతో అలంకరించి తలపై పెట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జెండా చెట్టువద్ద జెండాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మహబూబ్ షరీఫ్, అమీర్‌జాన్, జాఫర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** తంగెళ్ళమూడి పోస్టాఫీస్ వీధికి చెందిన కిడ్నీ బాధితుడు మహ్మద్ ఇక్బాల్‌కు రూ.10వేలు పింఛన్‌ను టీడీపీ నేత వందనాల శ్రీనివాస్ అందజేశారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** నగరంలో శివాలయాల వద్ద ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా అన్నాభిషేకం నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.
- **కామవరపుకోట :** నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపర్చాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు, రేషన్‌కార్డులు అందజేయాలని పోరాటం చేయనున్నట్టు సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు తెలిపారు.
- **చింతలపూడి :** గణేశ్ ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మండల హిందు ధర్మరక్షణ సేవాసమితి నాయకులు సిహెచ్ అంజిబాబు, టి.వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక విశ్వనాథ ఆశ్రమంలో మండలకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.
- **ఉంగుటూరు :** నారాయణపురం గ్రామదేవత కొట్టమ్మ జాతర ఆదివారం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ దిడ్ల అలకనంద, నల్లా ఆనంద్, సప్పా వీరబాబు పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం, మంగళవారం నాక్ బృందం పర్యటించనున్నట్లు కళాశాల కమిటీ చైర్మన్ ఈపూరి సత్యనారాయణ, సాగిరాజు జానకిరామరాజు, బొమ్మిడి అప్పారావు, ఆదిరెడ్డి సత్యనారాయణ తెలిపారు.
- మట్టి వినాయకుడి విగ్రహాల తయారీతో కాలుష్య నివారణపై యడవల్లి రమేష్ బృందం కళాజాత నిర్వహించారు. తూర్పు వీధి రామాలయం వద్ద ఈ కళాజాతాను నిర్వహించారు.
- **జంగారెడ్డిగూడెం :** ప్రజలకు కూటమి నాయకులు అండగా ఉంటామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. కీసర చెరువు ప్రాంతంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
- టీడీపీ సీనియర్ నాయకుడు జగ్గవరపు ముత్తారెడ్డిని ఆదివారం దాసరి శ్యామ్ చంద్ర శేషు పరామర్శించారు. ఇటీవల ముత్తారెడ్డి గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని స్వగ్రామం ఎర్రంపల్లి వచ్చిన సందర్భంగా దాసరి శేషు, నాయకులు పరామర్శించారు.
- **ఏలూరు టూటౌన్ :** శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. గ్రంథాలతో గడిపే ప్రతిక్షణం ఎంతో విలువైనదని, గ్రంథపఠనంతో విజ్ఞానదాయక అంశాలను నేర్చుకోవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంధాలయ దర్శనం చేయాలని ఆయన సూచించారు.



బత్తులవారిగూడెం అప్పారావు చెరువుకు పడిన గండి



చిన్నంపేట కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు



చెక్కపల్లి వద్ద కోతకు గురైన ప్రధాన రహదారి



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న నూజివీడు సబ్‌కలెక్టర్

అతలాకుతలం

» చెరువులకు గండ్లు » కొట్టుకుపోయిన రహదారులు » ముంపులోనే పొలాలు » స్తంభించిన జనజీవనం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 1: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నూజివీడు పెద్ద చెరువుకు భారీ గండ్లు పడ్డాయి. దాదాపు 250 ఎకరాల విస్తీర్ణం ఉన్న పెద్దచెరువుకు 300 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే కొన్ని సంవత్సరాలుగా దాదాపు 150 ఎకరాలు పెద్దచెరువు భూమి ఆక్రమణలకు గురి కావడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రమాదకరంగా ఉంటోంది. శనివారం కురిసిన భారీ వర్షానికి ఎగువన ఉన్న బత్తులవారిగూడెం, అప్పారావుచెరువు, కొత్త చెరువులకు గండిపడటం, యనమదల వద్ద ఎన్ఎస్‌పీ కాలువ యూటీ కూలడంతో ఈ నీరు ఒక్కసారిగా బిల్లు వాగు ద్వారా నూజివీడు పెద్దచెరువుకు చేరింది. ఓ వైపు భారీ వర్షంతో వస్తున్న వరదనీటికి తోడు ఈ నీరు తోడవ్వడంతో పెద్దచెరువుకు కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతంలో భారీ గండ్లు ఏర్పడ్డాయి.

ఒక్కసారిగా వరద...

నూజివీడు పెద్ద చెరువుకు దాదాపు నాలుగు చోట్ల గండ్లు పడటంతో వరదనీరు ఒక్కసారిగా కొప్పువెలమపేట, గాంధీనగర్‌ను ముంచెత్తింది. ఇళ్లల్లోకి నీరు చేరడంతో కొప్పువెలమపేట వాసులు తాళ్ల సహాయంతో బయటకు వచ్చారు. అటు నుంచి నీరు మొత్తం నూజివీడు బైపాస్ రోడ్డువైపు రావడంతో మడుపల్లి తాతయ్య జూనియర్ కళాశాలలోని బాలికల వసతి గృహం, ఇక్లాస్ పాఠశాల, త్రివిధ పాఠశాలలు ముంపునకు గురయ్యాయి.

తృటిలో తప్పిన ప్రమాదం...

పెద్దచెరువుకు గండ్లు పడటంతో వరదనీరు ఒక్కసారిగా పోటెత్తింది. ఈ నీరు రామిలేరుకు చేరడంతో రామిలేరు వరదలో శనివారం రాత్రి పలువురు చిక్కుకున్నారు. నూజివీడు - పోతురెడ్డిపల్లి ప్రధాన రహదారి పక్కన బాబా ఆలయం వద్ద దాదాపు 20 మంది చిక్కుకుపోవడంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం రాత్రి 8 గంటల వరకు శ్రమించి వారిని కాపాడింది. పెద్దచెరువు వరద వచ్చిన సమయంలో పశువులను కట్టేసేందుకు వచ్చిన వ్యక్తి విద్యుత్ స్తంభం సాయంతో రాత్రి 12 గంటల వరకు బిక్కుబిక్కుమని సహాయం కోసం ఎదురుచూశాడు. అతడ్ని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం రక్షించింది. తుక్కులూరులోని రామిలేరు వద్ద ఫంక్షన్‌కు వెళ్ళి కారులో తిరిగివస్తూ రామిలేరు లో లెవల్ బ్రిడ్జి దగ్గర హనుమాన్ జంక్షన్‌కు చెందిన మట్టా రమేష్ కుటుంబం వరద నీటిలో చిక్కుకుంది. గమనించిన స్థానికులు వారిని కాపాడారు. నూజివీడు మండలం, పట్టణ ప్రాంతాల్లో భారీ వర్షాలకు ఐదు చెరువులకు గండ్లుపడ్డాయి. నూజివీడు పెద్దచెరువుతో పాటు నూజివీడు మండలం బత్తులవారిగూడెం అప్పారావుచెరువు, కొత్త చెరువు, సుంకొల్లు, గొల్లవానికుంట, యనమదల పెద్దచెరువులకు గండ్లుపడ్డాయి.

వందలాది ఎకరాల్లో పంట మునక...

భారీ వర్షాలకు తోడు చెరువులకు గండ్లు పడటంతో నూజివీడు మండలం, పట్టణ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లోని పంట నీట మునిగింది. పెద్దచెరువు నీటి ముంపునకు దాదాపు 200 ఎకరాల్లో వరి పంట నీట మునగ్గా బత్తులవారిగూడెం అప్పారావుచెరువు వరద నీటికి మరో 200 ఎకరాల్లో పంట నీట మునిగింది. దీంతోపాటు భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న 2 వేల ఎకరాల్లోని సీడ్ పత్తి, 500 ఎకరాల్లో మినుము, మరో వెయ్యి ఎకరాల్లో వరి నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

సహాయక శిబిరాల ఏర్పాటు...

లోతట్టు ప్రాంతాల ప్రజలను నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరి సహాయక శిబిరాలకు తరలించారు. నూజివీడు పట్టణంలో ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు బాలికోన్నత పాఠశాలలో సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇరుచోట్ల 35 మందికి అధికారులు వసతి, భోజన ఏర్పాట్లను చేశారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోకే..

నూజివీడు పెద్దచెరువు గండి పడటానికి కారణం అధికారుల బృందం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ ముందస్తుగా తెలిపినా బలహీనంగా ఉన్న చెరువులను గుర్తించి గండ్లు పడితే వాటిని తక్షణం పూడ్చేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇందుకు గాను ఇసుక బస్తాలను స్థానికంగా ఏర్పాటుచేసి గండ్లుపడే అవకాశం ఉన్నచోటుకి తరలించి చర్యలు చేపట్టాలి. అయితే గత ప్రభుత్వంలో చెరువుల నిర్వహణను గాలికి వదిలివేయడంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఫలితంగా నూజివీడు ముంపునకు గురైంది. శనివారం నూజివీడు ప్రాంతంలో కుంభవృష్టికి నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లో పలు రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెద్దచెరువు వరద తాకిడికి నూజివీడు బైపాస్ రోడ్డు మార్జిన్ కోతకు గురి కాగా, నూజివీడు - ధర్మాజీగూడెం రహదారిపై మరో రెండుచోట్ల భారీ గండ్లు పడ్డాయి. నూజివీడు బాబా ఆలయం వద్ద ఊటవాగు ఉధతికి నూజివీడు, ముసునూరు రహదారి తీవ్రంగా దెబ్బతింది.

రాకపోకల నిషేధం

నూజివీడు పట్టణంలో ఇరువైపులా వరద నీరు ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు రాకపోకలను నిషేధించారు. నూజివీడు - తిరువూరు ప్రధాన రహదారిపై ఇటు బైపాస్‌లోనూ వరద ప్రవహిస్తోంది. దీంతో ముందస్తు చర్యగా పోలీసులు నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం ఆగిపోవడంతో వరద ఉధృతి తగ్గింది. అయితే భారీ వర్షాలకు ఎగువ ప్రాంతంలోని నీరు వాగుల ద్వారా వస్తుండటంతో అధికారులు నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నారు.

వరద ఉధృతికి కొట్టుకుపోయిన లారీ

నూజివీడు పట్టణంలో పెద్దచెరువుకు గండి పడడంతో వరద ఉధృతికి నూజివీడు బైపాస్ రోడ్డులో లారీ రహదారిపై నుంచి కొట్టుకుపోయి పల్టీ కొట్టింది. శనివారం రాత్రి భారీ వరద నూజివీడు బైపాస్ రోడ్డులో ప్రవహించడంతో బైపాస్‌పై వెళుతున్న కోళ్ళమేత లారీ వరద ఉధృతికి మార్జిన్ నుండి పక్కకు జరిగి, పక్కనే పంట పొలాల్లోకి పల్టీ కొట్టింది. అయితే డ్రైవర్ పాపారావు సురక్షితంగా బయట పడ్డాడు. కాగా భారీ వర్షాల నేపథ్యంలో నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

తమ్మిలేరుకు భారీగా వరద

చాట్రాయి: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరుకు వరద ఉధృతి బాగా పెరిగింది. చాట్రాయి మండలం చిన్నంపేట- చింతలపూడి మండలం శివపురం మధ్య ఉన్న కాజ్‌వేపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలను నిలిపివేశారు. తహసీల్దార్ ప్రశాంతి ఆదేశాల మేరకు చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వేను ఎవరూ దాటకుండా రెవెన్యూ సిబ్బంది కాపలా కాస్తున్నారు. తమ్మిలేరు వరద కారణంగా కోటపాడు-పోతునూరు, చీపురుగూడెం-మల్లాయిగూడెం, పోలవరం-యడవల్లి గ్రామాల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. మండలంలో పెద్ద చెరువు వాగు, ఉప్పువాగు, రేగటి వాగు, చింతకొయ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పత్తి చేల్లో నీరు నిలిచింది. చాట్రాయి వికాస్ కాలేజి ఆవరణలో నీరు నిలిచింది. మండలంలో 68.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని, చనుబండలో ఒకటి, మర్లపాలెంలో ఒక పూరిల్లు కూలిందని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు.

కొట్టుకుపోయిన తమ్మిలేరు కాజ్‌వే అప్రోచ్ రోడ్డు

తమ్మిలేరుకు వరద పోటెత్తడంతో మండలంలో చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం మధ్య ఉన్న తమ్మిలేరు కాజ్‌వే అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. కాజ్‌వే నిర్మాణ సమయంలో నిధులు సరిపోక చిన్నంపేట వైపు తక్కువ ఖానాలు నిర్మించి అప్రోచ్ రోడ్డు వేశారు. ఏటా వరదలు వచ్చినప్పుడు అప్రోచ్ రోడ్డుకు గండిపడి రాకపోకలు ఆగిపోవటం షరా మామూలు అవుతున్నది. శివపురానికి చెందిన సుమారు 200 మంది విద్యార్థులు చిన్నంపేట పాఠశాలలో చదువుతున్నారు. శివపురం రైతులకు చిన్నంపేటలో, ఇక్కడి రైతులకు అక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయి. కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోతే రైతులు విద్యార్థులు, కూలీలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి చిన్నంపేట వైపు అప్రోచ్ రోడ్డు స్థానంలో ఖానాలు నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

3 ప్రధాన రహదారుల్లో స్తంభించిన రాకపోకలు

ముసునూరు: మండలంలో ప్రధాన రహదారులపై వాగులు ఆదివారం కూడా ఉధృతంగా ప్రహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వరి, పత్తి పంటలపై వరద నీరు ప్రవహిస్తోంది. చెక్కపల్లి వద్ద సంధ్య వాగు ఉధృతికి ప్రధాన రహదారి కోతకు గురై గండిపడటంతో ముసునూరు-చెక్కపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సింహాద్రిపురం వద్ద రాములేరు వాగు రహదారిపై సుమారు నాలుగడుగుల ఎత్తులో ప్రవహిస్తుండటంతో నూజివీడు-ముసునూరు మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. అలాగే వలసపల్లి ప్రధాన రహదారిలో ఊటవాగు, సంధ్య వాగుల వరదనీటి ప్రవాహానికి రాకపోకలు నిలిచాయి. అలాగే ముసునూరు, గుడిపాడు, గోపవరం, యల్లాపురం, చెక్కపల్లి తదితర గ్రామాల్లో వరి, పత్తిపంటలు నీటమునిగాయి. చింతలవల్లి సొసైటీ భవనం చుట్టూ నీరు చేరడంతో ప్రహరీ కూలిపోయింది. రమణక్కపేట కుమ్మరి బజారులో నివాస గృహాలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. నీటి తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై బాధితులు మండిపడుతున్నారు. చెక్కపల్లిలో హెల్త్‌క్లినిక్ చెరువును తలపిస్తోంది. మండల పరిధిలో ఉన్న తమ్మిలేరు ఉధృతంగా ప్రహిస్తోంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీస్, సచివాలయ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా ఉన్న సాగు, మంచినీటి చెరువులు సైతం నిండుకుండలా మారి, కళింగలు పారుతున్నాయి. అయితే మండలంలో ఈ తుఫాన్ వల్ల ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని, గ్రామాల్లో పరిస్థితులను వీఆర్వోలు, కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎమిలికుమారి, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి, నెక్కలం అంకమ్మ కోనేరు, రాజవరం, శోభనాపురం, వడ్లమాను, నరసింగపాలెం గ్రామాల్లో చెరువులకు గండ్లుపడి నీరు వృథాగా పోతోంది. ఆగిరిపల్లి మెట్లకోనేరు వెంట ఉండే పెద్దచెరువుకు గండిపడి నీరు వృథా కావడంతో సర్పంచ్ విక్టర్ ఎక్స్‌కవేటర్లతో నీరు మళ్ళకుండా మరమ్మతులు చేయించారు.

కొల్లేరుకు వరద ఉధృతి

మండవల్లి: గతంలో ఎన్నడూ లేని రీతిలో కొల్లేరుకు ఎగువ 64 డ్రెయిన్ల నుంచి పెద్దఎత్తున ముంపు నీరు రావడంతో కొల్లేరు ఉగ్రరూపం దాల్చింది. దీంతో కొల్లేటి లంక గ్రామాలకు ప్రధాన రహదారి అయిన పెదఎడ్లగాడి -పెనుమాకలంక అర్అండ్‌బీ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు మూడుచోట్ల రహదారి ముంపునకు గురై రాకపోకలకు వీలు లేకుండా వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కొల్లేటిలంక గ్రామాలైన మండలంలోని మణుగూలూరు లంక, పెనుమాక లంక, నందిగామ లంక, శ్రీరామ్‌నగర్, ఇంగిలిపాక లంక, నుచ్చుమిల్లి, తక్కిళ్లపాడు, పులపర్రు గ్రామాలకు ముంపు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో పెదఎడ్లగాడి-పెనుమాకలంక రహదారిపై ప్రవహిస్తున్న వరదను కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సబ్బా సురేష్‌బాబు, గుంటూరు సత్యనారాయణ, మండవల్లి ఎస్సై రామచంద్రరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. తూడు, గుర్రపుడెక్క తొలగింపు చర్యలు తీసుకుంటున్నట్లు చాపరాల దుర్గాప్రసాద్ తెలిపారు. వీఆర్వో వెంకటేశ్, కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు. అయ్యవారి రుద్రవరం గ్రామంలోని పొలాలు ముంపు బారినపడ్డాయి. ఇలాగే మరో రెండు మూడు రోజులు ఉంటే వరిచేను కుళ్లిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఉధృతంగా సర్కారు కాలువ

కైకలూరు: కొల్లేటికోటలోని సర్కారు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రైన్ నుంచి డ్రైన్ పొంగి పొర్లుతూ కొల్లేరు సరస్సులో చేరడంతో ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. డ్రైన్‌పై కోమటిలంక గ్రామస్థులు నిర్మించుకున్న తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామం నుంచి ప్రజలు నాటుపడవలపై బయటకు రావాల్సి వస్తోంది. డ్రెయిన్ కొల్లేరులో అనుసంధానం అయ్యే ప్రదేశంలో నీరు సుడులు తిరుగుతూ ప్రవహిస్తుండడంతో చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. మరో రెండు, మూడు రోజులపాటు ఎగువ నుంచి భారీగా నీరు సరస్సులోనికి చేరుతుందని అంచనా.

డ్రెయిన్లను పరిశీలించిన జడ్పీ సీఈవో

పుల్లవ డ్రెయిన్ ఆధునికీకరించకపోవడంతో కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలో గోపవరం వద్ద వంతెనపైకి భారీగా నీరు చేరింది. అలాగే అగ్రహారం రోడ్డుపై వరదనీరు చేరుతోంది. కైకలూరు పట్టణంలో రహదారులు జలమయం కావడంతో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని ఆదేశాలతో కైకలూరు వెలమపేట కాలనీలోని నీటిని మోటార్ల ద్వారా డ్రెయిన్లలోకి తరలిస్తున్నారు. కైకలూరు మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో ఆర్‌వీవీ సుబ్బారావు కైకలూరులో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ అధికారులకు సూచనలిచ్చారు. పుల్లవ డ్రెయిన్, వార్లకోడు, కైకలూరు పట్టణంలోని మేజర్, మైనర్ డ్రెయిన్లను తహసీల్దార్ ఉదయ భాస్కరరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలసి పరిశీలించారు. పుల్లవ డ్రెయిన్ వద్ద ఎంపీపీ కృష్ణ, సర్పంచ్ నవరత్నకుమారి అధికారులతో కలిసి పరిశీలించి ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. పలు అంతర్గత రహదారుల్లోని వరదనీరు తరలించేందుకు ప్రత్యేకంగా మోటార్లను ఏర్పాటుచేశారు. వ్యవసాయ శాఖ అధికారులు ఆర్. దివ్య, కైకలూరు మండలంలోని గోపవరం, రాచపట్నంలోని వరి పొలాలను పరిశీలించి పొలాల్లో నీటిని తరలించేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ముంపు నివారణ చర్యలు చేపట్టారు. ప్రజలకు భారీ వర్షాల వలన ఏమైనా ఇబ్బందులు కలిగితే తక్షణమే తహసీల్దార్ కార్యాలయ హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలన్నారు.

కలిదిండి: కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లోని వరి పొలాల్లో భారీగా వర్షపు నీరు పడింది. నీటిని బయటకు తోడే అవకాశం లేదని, మురుగు కాల్వల్లో నీరు ఎగదన్నటంతో ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. మురుగు కాల్వల్లో పూడిక సక్రమంగా తొలగించకపోవటంతో ఈ దుస్థితి నెలకొంటుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిస్తే వరి పైరు ముంపు బారిన పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పైరుకు నష్టం లేదని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తెలిపారు.

ముదినేపల్లి: గ్రామాల్లో ముంపును సత్వరం తగ్గించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని ముదినేపల్లి మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.వి.నాగమణి ఆదేశించారు. మండలంలో ముంపు ప్రాంతాలను ఆదివారం ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులతో కలసి పరిశీలించారు. ముదినేపల్లిలోని గురజ రోడ్డులో రెండు రోజులుగా నిలిచిన నీటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగించే పనులను పర్యవేక్షించారు. పెయ్యేరు కాలనీలో ముంపు నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో నిల్వ నీటిని తగ్గించేందుకు డ్రెనేజీ సౌకర్యం మెరుగుపర్చాలని ఆమె పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆర్ఐ శివ కుమార్ పాల్గొన్నారు. భారీ వర్షాలకు ముంపునకు గురైన చెంచుల కాలనీని ఆదివారం టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పలువురు నాయకులు, అధికారులు పరిశీలించారు. కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో నిరాశ్రయులైన కాలనీ వాసులకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. అనంతరం పెదకొమ్మిలేరు డ్రెయిన్ కింద ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. టీడీపీ నాయకులు గురువు సుబ్రహ్మణ్యం, కట్టా వెంకట రామయ్య, సోమేరు, వీఆర్వో మురళీ తదితరులు పాల్గొన్నారు.



ముంపులో పెదఎడ్లగాడి పెనుమాకలంక ఆర్అండ్‌బీ రోడ్డు



కొల్లేరులోకి చేరుతున్న వరదనీరు



పెదగొన్నూరులో మునిగిన సార్వా వరి పొలాలు



పుల్లవ డ్రైన్ పొంగి ముంపునకు గురైన వంతెన, రహదారి

టీడీపీ నాయకుల సంబరాలు



కలిదిండి, సెప్టెంబరు 1 : చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు అవుతున్న సందర్భంగా మట్టగుంటలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. టపాసులు కాల్చారు. చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, కొప్పనాతి విష్ణు, తిరుమాని చిన్ని కృష్ణ, కొప్పనాతి శంకర్, టి.నరసింహస్వామి, మోకా శంకర్, పొన్నాల తాతారావు, నడకుదుటి ఆంజనేయులు, ఈశ్వర పరశురాముడు, కొప్పనాతి రాము, పొన్నాల సత్యనారాయణ పాల్గొన్నారు.

నీరు లాగిన వెంటనే నష్టం అంచనా..

ఆగిరిపల్లి: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి పలగాని చెన్నారావు పరిశీలించారు. వట్టిగుడిపాడు గ్రామంలో భారీ వర్షాలకు నీట మునిగిన ప్రత్తి పొలాలను పరిశీలించారు. మండలంలో భారీ వర్షాలకు వరి 850 ఎకరాలు, ప్రత్తి 50 ఎకరాలు, మినుము 480 ఎకరాలు మొత్తం కలిపి 1380.00 ఎకరాల్లో పంట నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు తెలిపారు. పొలాల నుంచి నీరు లాగిన తర్వాత పంట నష్టం అంచనా వేస్తామని తెలిపారు. రైతులు పొలాల్లో నుంచి నీరు బయటకు వెళ్ళిన తరువాత ఎకరానికి 30 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ను చల్లుకోవాలని సూచించారు.

లభ్యంకాని గల్లంతైన వ్యక్తి ఆచూకీ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 1: ఆగిరిపల్లి మండలం ఒట్టిగుడిపాడు గ్రామంలో పొలం నుండి పశువులకు మేత తెస్తూ వాగులో గల్లంతైన నాగ వీర్రాజు ఆచూకీ ఇంతవరకు లభ్యం కాలేదు. 50 మంది సహాయక బృందం అతని కోసం వెతుకుతున్నా ఆచూకీ దొరకలేదు. అతని కుమారుడు నాగశ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో

వణుదుర్రు యువతి మృతి..

ముదినేపల్లి, సెప్టెంబరు 1 : విజయవాడలో శనివారం కొండ చరియలు విరిగి పడిన ఘటనలో ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామానికి చెందిన నవుడు మేఘన (24) అనే యువతి మరణించింది. ఈమె విజయవాడలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో క్రెడిట్ కార్డు సెక్షన్‌లో పని చేస్తున్నది. తల్లిదండ్రులతో సహా ఈమె అక్కడే నివాసం ఉంటోంది. మరో పది నిముషాల్లో ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో కొండ చరియలు విరిగి పడి ఆ యువతి మృత్యువాత పడింది. మృతురాలి తల్లిదండ్రులకు కూడా తీవ్ర గాయాలై నడవలేని స్థితిలో ఉన్నారు. ఈ ఘటన వణుదుర్రు వాసులను విషాదంలో నింపింది. ఆదివారం మేఘన అంత్యక్రియలను వణుదుర్రులో నిర్వహించారు. ఆమె తల్లిదండ్రుల వేదన చూపరుల హృదయాలను కలచి వేసింది. టీడీపీ, జనసేన నాయకులు పలువురు మేఘన కుటుంబాన్ని పరామర్శించారు.

సీఎం ఆదేశాలతో మంత్రి పర్యవేక్షణ



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సారథి

నూజివీడు, సెప్టెంబరు 1: భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని ఆదేశించారు. ఏలూరు జిల్లాలో ప్రస్తుత పరిస్థితిని చంద్రబాబు ఫోన్‌లో మంత్రితో మాట్లాడి తెలుసుకున్నారు. ఏలూరు జిల్లా యంత్రాంగం అధికారులను ముందుగానే అప్రమత్తం చేయడంతో ఎటువంటి నష్టం జరగకుండా చూడగలిగామని మంత్రి చంద్రబాబుకు వివరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి రెవెన్యూ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటుచేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నామని, ఎటువంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రికి సారథి వివరించారు. నూజివీడులో భారీ గండి పడిన తరువాత పట్టణంలో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రజలను అక్కడకు తరలించి భోజన సదుపాయాలు కల్పించామన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తమకు తెలియచేయాలని ముఖ్యమంత్రి పార్థసారథిని ఆదేశించారు.

బాధితులను ఆదుకుంటాం : సారథి ...

అధికవర్షాల వల్ల నష్టాలకు గురైన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, మంత్రి పార్థసారథి తెలిపారు. నూజివీడు పట్టణంలో నీట మునిగిన గాంధీనగర్, ఎన్టీఆర్ కాలనీ, అప్పారావుపేట, కొప్పువెలమపేట మండలంలోని బత్తులవారిగూడెం, యనమదల తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి బాధితులను కలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. రెస్క్యూ కార్యకలాపాలు ముగిసిన తరువాత చెరువులు, కాలువల పూడికతీసి గట్లను పటిష్ఠం చేసి, వర్షాల వల్ల జరిగే నష్టాలను నివారించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

మొగలిచెరువుతో పొంచి ఉన్న ముప్పు..

నూజివీడు పట్టణం నడిబొడ్డున ఉన్న మొగలిచెరువు నిండుకుండలా ఉందన్నారు. ఈ చెరువులో కూడా ఆక్రమణలు ఉన్నాయని, పెద్దచెరువుకు పడిన గండి ఊరి చివరపడటం వల్ల పెద్దప్రమాదం తప్పిందని, అదే మొగలిచెరువుకు గండిపడితే తీవ్ర నష్టం జరిగేదని మంత్రి తెలుపుతూ ఆక్రమణదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. అధికారులను పంపి మొగలిచెరువు గట్లను పరిశీలించి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఆదేశించారు.

వరద పరిస్థితిని పరిశీలించిన అధికారులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 1: నూజివీడు పట్టణంలో పెద్దచెరువుకు భారీ గండ్లు పడటంతో వరద పరిస్థితిని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, జేసీ పి. ధాత్రిరెడ్డి, నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి పరిశీలించారు. ఈ సందర్భంగా నూజివీడు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాన్ని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించి అందుతున్న సేవలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నూజివీడులోని వెలమపేట, పెట్రోల్‌బంకు, లారీ యూనియన్ ఆఫీస్ ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ, జేసీ పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను, శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల ఎక్కడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని వారు సూచించారు. ఇక సహాయక చర్యల్లో అనునిత్యం అప్రమత్తంగా వ్యవహరించి ఎటువంటి ప్రాణనష్టం లేకుండా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని అధికారుల బృందం అభినందించింది.

నేటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

ఆగిరిపల్లి, సెప్టెంబరు 1: ఆగిరిపల్లి మండలంలో నేటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు జరుగుతుందని పార్టీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ ఆర్వే రంగారావు తెలిపారు. 2వ తేదీ సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మోదీకి సభ్యత్వం ఇవ్వడంతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తదుపరి రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి మారుమూల గ్రామాల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, గతంలో సభ్యత్వం పొందిన కాలపరిమితి ఐదు సంవత్సరాలకు ముగిసినందున ప్రతి ఒక్కరూ తిరిగి పార్టీ సభ్యత్వం పొందాలని, సభ్యత్వ నమోదు కోసం 8800002024 కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు.

పాతపెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

ఏపీటీఎఫ్ నాయకుల వినతి

కైకలూరు, సెప్టెంబరు 1: ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు జడ్పీటీసీవో సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనను గౌరవించి ప్రభుత్వం పాతపెన్షన్ అమలు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. యూనియన్ నాయకులు సంబూరి భాస్కర వర్మ, వి. భానుమూర్తి, బొర్రా శ్యాంసుందర్, ఎస్. శివాజీ, జకావుల్లా, మస్తాన్ బేగ్, మర్ఫీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా టీడీపీ నాయకులు

ముసునూరు, సెప్టెంబరు 1: బసవరపుపాడు వాగు ఉధృతికి అంబేడ్కర్ కాలనీ వరద నీటిలో చిక్కుకుంది. సుమారు 30 కుటుంబాల వారికి స్థానిక జడ్పీ పాఠశాలలో పునరావాసం కల్పించారు. ఆదివారం సర్పంచ్ టి. రాధికా సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావుతోపాటు మాజీ ఉప సర్పంచ్ కె.సత్యనారాయణ, మాదల వెంకటేశ్వరరావు, కంచర్ల సత్యనారాయణ, కూచిపూడి దేవేంద్ర, కాటేపల్లి శేషుబాబు తదితరులు బాధితులకు బియ్యం, కూరగాయాలు, నిత్యావసర సరుకులు వితరణ చేశారు. బాధితులకు భోజనం అందించారు. రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కరీముల్లా ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య సమస్యలున్నవారికి మందులను అందజేశారు. అంబేడ్కర్ కాలనీలో వరద నీరు తగ్గుముఖం పట్టిందని వీఆర్వో పాయాస్ తెలిపారు. అలాగే వలసపల్లి ఎస్సీ కాలనీని చుట్టుముట్టిన వరదనీటిని సర్పంచ్ చలసాని దామోదరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర ఆధ్వర్యంలో తొలగించారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం వణుదుర్రు, దేవపూడి, వూటుకూరు గ్రామమాల్లో వర్షాలకు ముంపు బారిన పడిన వరి పొలాలను ఆదివారం కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, కూటమి నాయకులు పరిశీలించారు. సార్వా వరి పైరు ముంపునకు గురై నష్టాలకు దారి తీస్తున్న పరిస్థితులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

హెల్పింగ్ హ్యాండ్స్ వితరణ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 1: నూజివీడు ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల వసతిగృహం ముంపునకు గురవ్వడంతో కట్టుబట్టలతో బయటకు వచ్చిన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో చదువుతున్న బాలికలు, ఫ్యాకల్టీ నుంచి వస్త్రాలను సేకరించి అందించారు. దీంతో పాటు రూ.15 వేలు నగదును సేకరించి ఎమ్మెల్యే పార్థసారథి చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు కె.బ్రహ్మస్వాములు, సభ్యులు మధు, సలీమ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు డివిజన్‌లో 657 మి.మీ.వర్షపాతం

నూజివీడు డివిజన్ వ్యాప్తంగా గత 24 గంటల్లో 657 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యధికంగా ముసునూరు మండలంలో 156 మిల్లీమీటర్లు నమోదు కాగా, అత్యల్పంగా చింతలపూడిలో 45 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. నూజివీడులో 142.2, ఆగిరిపల్లిలో 129.8, లింగపాలెంలో 115.6, చాట్రాయిలో 68.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

పునరావాస కేంద్రంలో చిమిడిన అన్నం..

నూజివీడు, సెప్టెంబరు 1: నూజివీడు పట్టణంలో అధిక వర్షాలకు పెద్దచెరువుకు పడిన గండితో గాంధీనగర్, కొప్పువెలమపేట ముంపునకు గురయ్యాయి. గాంధీనగర్‌లో అప్పారావుపేట స్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఈ పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజనాన్ని ప్రభుత్వం సరఫరా చేసింది. అన్నం ముద్దగా ఉండటంతో బాధితులు తినలేకపోయారు. దీంతో ఈ కేంద్రంలో స్థానిక నాయకులు బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన కూరలను ఇచ్చి, ఇంటికి వెళ్ళి అన్నం వండుకు తినమని బ్రతిమాలి పంపారు.